www.bharathasakthi.com

# భారత్ శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 21 | సంచిక : 24 | హైదరాబాద్ | ఆదివారం,జూన్ 28 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|---|

## ఈ నెల 28న నల్గొండ జిల్లాకు సీఎం రేవంత్



హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేందుకు రూ.13,006 కోట్ల భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ హ్యామ్ పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు ఈనెల 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మొదటి విడతలో 6,092 కిలోమీటర్ల మేర 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు: స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

- నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం
- 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యే స్లాబ్ ఉండాలని ఆదేశం
- ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు మించరాదని స్పష్టీకరణ
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ




**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం

2లో..

## సుప్రీం కోర్టు తీర్పు.. దశాబ్దాల నాటి ఆస్తి తగాదాకు ఫుల్ స్టాప్

**న్యూఢిల్లీ (భారత శక్తి)** నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది. భూమికి సంబంధించిన 1957 నాటి సేల్ డీడ్ చట్టబద్ధమేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి అంజరియాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది. ఈ కేసులో అప్పీలు చేసుకున్న సరాఫత్ అలీ పూర్వీకులు 1957లో హరిద్వార్ (ఉత్తరాఖండ్) కొంత భూమిని కొనుగోలు చేశారు. అప్పటికి సరాఫత్ అలీ మైనర్. నాటి నుంచీ ఆ భూమి సరాఫత్ అలీ కుటుంబం ఆధీనంలోనే ఉంది. భూమిని సరాఫత్ పూర్వీకులకు అమ్మిన కొందరు అభ్యంతరం చెప్పడంతో సేల్ డీడ్ జరిగినా మ్యూటేషన్ మాత్రం నిలిచిపోయింది. 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యూటేషన్ కూడా పూర్తయ్యింది. అయితే, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది.

2లో..



## వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా

### - పూర్తిచేసే బాధ్యత కూడా నాకే వచ్చింది: సీఎం చంద్రబాబు

- మార్కాపురం జిల్లాలో చంద్రబాబు పర్యటన
- 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమం ప్రారంభం
- వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని ప్రజలకు హామీ
- గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని వెల్లడి
- ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలని, యువత టెక్నాలజీపై దృష్టి పెట్టాలని పిలుపు



**అమరావతి (భారత శక్తి)**తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం,

2లో..

## 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

- సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ
- 194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన
- పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని
- భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం

2లో..

## 'సర్'ను సీరియస్‌గా తీసుకోండి: కేటీఆర్



**హైదరాబాద్ (భారత శక్తి)** మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు.కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

## ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (భారత శక్తి)** పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది.

2లో..



## తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం

### 9 ఏళ్ల బంధానికి స్వస్తి.. డీఎంకే కూటమికి ఎండీఎంకే గుడ్‌బై

- డీఎంకే కూటమితో తొమ్మిదేళ్ల బంధాన్ని తెంచుకున్న ఎండీఎంకే
- సీఎం విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా పార్టీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- తమను బలహీనపరిచేందుకు డీఎంకే కుట్ర చేసిందని వైకో ఆరోపణ
- వైకో వారసత్వ రాజకీయాలే పార్టీ బలహీనతకు కారణమన్న డీఎంకే
- పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకేతోనే ఉంటామన్న ఇద్దరు ఎండీఎంకే ఎమ్మెల్యేలు





**తమిళనాడు న్యూఢిల్లీ** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తొమ్మిదేళ్లుగా డీఎంకేతో కొనసాగుతున్న బంధాన్ని ఎండీఎంకే అధికారికంగా తెంచుకుంది. నేడు జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే, టీవీకే నేతృత్వంలోని కూటమిలో చేరుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయనప్పటికీ, ఆ దిశగానే సంకేతాలు ఇచ్చింది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అభినందిస్తూ ఎండీఎంకే తీర్మానాలు చేసింది. అవినీతి రహిత పాలన, మేఘదాతు డ్యామ్ వంటి అంశాల్లో తమిళనాడు హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాజీలేని వైఖరిని కొనసాగించాలని కోరింది. టీవీకే కూటమిలో చేరికపై ప్రత్యక్ష ప్రస్తావన లేనప్పటికీ, ఇటీవలి పరిణామాలు ఆ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

#### కూటమి నుంచి ఎందుకు వైదొలిగారంటే?

డీఎంకే కూటమిలో కొనసాగలేని పరిస్థితులు ఉన్నాయని ఎండీఎంకే ఆరోపించింది. "తమ పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరిగాయని", "ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు

2లో..

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు: అమిత్ షా

- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి
- డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా
- 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే ప్రధాని మంత్రాన్ని సాకారం చేస్తున్నట్లు వ్యాఖ్య

**న్యూఢిల్లీ (భారత శక్తి)**రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు




కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార

2లో..

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

### - రాంచందర్ రావు

**హైదరాబాద్ (భారత శక్తి)** పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.



# కొండపైన దుకాణాలు రద్దు చేయాలని రిలే నిరహార దీక్ష

## నూతన టెండర్లు వేయాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ డిమాండ్




భారత శక్తి, జూన్ 27 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం పరిధిలో గల కొండపైన వర్తకసంఘం పేరుతో కొన్నేళ్లుగా కొందరు మాత్రమే వ్యాపారాలు నిర్వహిస్తున్నారని అట్టి దుకాణాలను రద్దు చేసి నూతన టెండర్లు వేయాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు రిలే నిరహార దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని అధికారుల మరియు రాజకీయ నాయకుల పైరవీలతో పునరుద్ధరణ చేసుకుంటూ కొత్తవారికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా చేస్తున్న వర్తక సంఘాన్ని తక్షణమే రద్దు చేసి టెండర్లు వేయాలని కోరారు. గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవని వ్యాపారులు, నాయకులు కలిసి ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారని పేర్కొన్నారు. రాజకీయ, అధికార బలంతో ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారని అన్నారు. స్వామి వారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా వర్తకసంఘంలోని వ్యాపారులు ఎటువంటి ఆస్తులు భూములు కోల్పోలేదని, స్వామి వారి కోసం స్థానికులు ఎంతో మంది వారి ఇండ్లను భూములను కోల్పోయారని వారికి ఎటువంటి న్యాయం జరగలేదని కాబట్టి ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదని కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. గత నెల 31వ తేదీతో వర్తకసంఘం వారి దుకాణాల నిర్వహణ గడువు ముగిసినా ఒక నెల వారికి మళ్ళీ అవకాశం ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. ఇదే విధంగా కొనసాగించడం వల్ల దేవస్థాన ఆదాయానికి గండి పడుతుందని వాటిని కచ్చితంగా టెండర్లు వేయాలని కోరడం జరిగింది. లేకపోతే ఉద్యమ కార్యాచరణ పెద్ద ఎత్తున చేస్తామని కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండి అనిల్, బుగ్గ ఆంజనేయులు, కర్రె ప్రవీణ్, మందోజు నరేష్, పెద్ద కందుకూరు గ్రామ సర్పంచ్ గుండ్లపల్లి వెంకటేష్, ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి పి రాజిరెడ్డి, బండ రామస్వామి, దేవపూజ అశోక్, ముఖ్యర్ల వెంకటేష్, చిన్న రాజు, పసుపునుటి మురళి, మాటూరి బాలయ్య, కొన్నె సంజీవ, దొమ్మాట ప్రభాకర్, గుండు కుమార్, శ్రీనాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డిపల్లిలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసిన డీసీసీ అధ్యక్షుడు

## మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ జిల్లా, నర్సాపూర్, జూన్ 27 (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ శనివారం ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సవరణ ప్రక్రియను నిర్వహించాలని కోరారు. ఓటర్లు తమ వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైతే పేరు చేర్పు, మార్పు లేదా తొలగింపుకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.

అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఉందని ఆంజనేయులు గౌడ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు వివరాల సేకరణ ప్రక్రియలో బీజేపీ నాయకులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని ఆరోపిస్తూ, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) లు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీ, ప్రజాప్రతినిధి అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఓటర్లలో ఎలాంటి అపోహలు లేకుండా అవగాహన కల్పిస్తూ, సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, అధ్మాపూర్ సర్పంచ్ సురేష్ నాయక్, ఖాజీపేట్ సర్పంచ్ యాదగిరి గౌడ్, బూత్ లెవల్ అధికారి (బి ఎల్ ఓ), బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఎ) లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,

# 1.8 కిలోల గంజాయి స్వాధీనం ముగ్గురు అరెస్ట్,మరో ముగ్గురు పరారీ..

జనగామ (భారత శక్తి)జూన్ 27 పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐ దూలం పవన్ కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఈరోజున పాలకుర్తి బస్ స్టాండ్‌లో వాహనాలు,అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా 1.8 కిలోల గంజాయి లభ్యమైంది.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.90,000/- (తొంభై వేల రూపాయలు). అలాగే గంజాయి రవాణాకు ఉపయోగించిన బ్యాగు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు, పరారీలో ఉన్న అమర్ (బరంపూర్, ఒడిశా) అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి, గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఖాన్ అక్రమ్ యార్ మహమ్మద్, వాజిద్ సజ్జన్లకు సరఫరా చేయడానికి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా నుండి రైలులో తీసుకొస్తుండగా వరంగల్ ప్రాంతంలో పోలీసులు అధికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని గుర్తించి,పాలకుర్తి మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్ణయించుకుని బస్సులో పాలకుర్తి చేరుకుని హైదరాబాద్ వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా, విశ్వసనీయ సమాచారం మేరకు పాలకుర్తి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.అరెస్టు చేసిన ముగ్గురు నిందితులు గుజరాత్ రాష్ట్రానికి చెందినవారు.కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఈ మేరకు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.140/2026, ఎన్‌డీపీఎస్ చట్టం, 1985లోని సెక్షన్ 8(ఎ) తీ/ష 20(ఎ)(అఅ)(దీ) కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు పంపించడం జరిగింది.ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ దూలం పవన్ కుమార్ తో పాటు పోలీసు సిబ్బంది పీసీ యాకయ్య, ప్రశాంత్ రెడ్డి, సురేష్, నరేష్ లను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జానకీ రామ్ రెడ్డి అభినందించారు.గంజాయిని కొనుగోలు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం,సేవించడం చట్టరీత్యా నేరం.ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పాలకుర్తి పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా, నిల్వలకు సంబంధించిన ఏదైనా



సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. అలాగే ఉపయోగకరమైన సమాచారం అందించిన వారికి శాఖ నిబంధనల మేరకు తగిన నగదు బహుమతి కూడా అందజేయబడుతుంది.పాలకుర్తి మండలాన్ని మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పాలకుర్తి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# 15 ఏళ్ల సమస్యకు మంత్రి పరిష్కారం

**కరీంనగర్,(భారత శక్తి)** బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కొత్త సర్వీసు ప్రారంభించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపించారు. దీంతో ఆ మార్గంలోని గ్రామాలు.. గత 15 ఏళ్లుగా బస్సు కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. దీంతో వారు మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా తమ మార్గంలో బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరినా.. ఎవరూ పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి తమ గోడు విని స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత యుగంలో ప్రజల జీవనశైలి శరవేగంగా మారిపోతున్నా.. కొన్ని మారుమూల ప్రాంతాలు మాత్రం వెనకబడిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ప్రశ్నలకు దారితీస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలాంటి గ్రామాలకు మౌలిక వసతుల కల్పన జరిగితే.. ఆ జనాల్లో వచ్చే ఆనందాలే వేరు. ఇలా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వారి దీనస్థితిని చూసి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు రంగంలోకి దిగి.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి వారి మొహాల్లో చిరునవ్వులు చిందేలా చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వారికి బస్సు సౌకర్యం వచ్చింది. ఈ బస్సు సర్వీసు జగిత్యాల నుంచి ప్రారంభమై.. వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు గతంలో నడిచేది. కానీ ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆ మార్గంలో ఉండే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే తమకు తిరిగి బస్సు సౌకర్యం కల్పించాలని.. గత 15 ఏళ్లుగా ఎంతోమందికి విజ్ఞప్తులు, వినతులు పెట్టుకున్నారు.ఈ క్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని వారికి తిరిగి బస్సు సౌకర్యం కల్పించారు.

# తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం

రహస్య ప్రణాళికలు రచించారని" ఎండీఎంకే తన తీర్మానంలో ఆరోపించింది. అందుకే కూటమి నుంచి వైదొలగాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. అయితే, ఈ ఆరోపణలను డీఎంకే ఖండించింది. "ఎండీఎంకేకు అసెంబ్లీ, పార్లమెంటులో ప్రాతినిధ్యం లభించేలా చేసింది డీఎంకేనే" అని పార్టీ నేత సయ్యద్ హఫీజుల్లా అన్నారు. "వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన వైకో, ఇప్పుడు తన కుమారుడు దురై వైకోకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడమే ఎండీఎంకే బలహీనపడటానికి కారణం" అని ఆయన విమర్శించారు.

### ఎండీఎంకేకు ఎదురుదెబ్బ

ఎండీఎంకేకు కూడా ఎదురుదెబ్బ తగిలింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 'ఉదయిస్తున్న సూర్యుడు' గుర్తుపై గెలిచిన ఇద్దరు ఎండీఎంకే ఎమ్మెల్యేలు, పార్టీ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. తాము డీఎంకేతోనే కొనసాగుతామని వారు స్పష్టం చేశారు. దీంతో ఎండీఎంకే అధికారికంగా టీవీకేతో కలిసినా, ప్రభుత్వ బలం తక్షణమే పెరగదు. అలాగే, ఉప ఎన్నికలకు ఆస్కారం కూడా ఉండదు.

### మారిన పొత్తుల స్వరూపం

టీవీకే ప్రభుత్వం ఎదుర్కొన్న విశ్వాస పరీక్ష సమయంలో ఎండీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉండటంతోనే ఈ మార్పులకు పునాది పడింది. అనంతరం వైకో, దురై వైకోలు ముఖ్యమంత్రి విజయ్‌తో పాటు టీవీకే సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. తాజా పరిణామం నేపథ్యంలో... ప్రస్తుతం టీవీకే కూటమిలో ఎండీఎంకే కూడా చేరే అవకాశాలున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌కు రెండు, వీసీకే, ఐయూఎంఎల్‌లకు ఒక్కో మంత్రి పదవి లభించగా, సీపీఐ, సీపీఎంలు టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్లు: స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామంది లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించింది. గోడల నుంచి ఎనిమిది అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు విధించింది. ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది.

# సుప్రీం కోర్టు తీర్పు.. దశాబ్దాల నాటి ఆస్తి తగాదాకు ఫుల్ స్టాప్

ఈ క్రమంలో తనను భూమిదారుగా గుర్తించాలని సరాఫత్ దరఖాస్తు చేసుకున్నారు. 1993లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ హక్కులను గుర్తించారు. అయితే, సరాఫత్ భూమిపై కో టెన్యూర్ హక్కులున్న మరికొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో 1999లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు. యూపీ జమీందారీ భూములు రద్దు చట్టం ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. అంతేకాకుండా నాటి సేల్ డీడ్‌పై సంతకం చేసిన సాక్షి వివరాల్లో స్పష్టత లేకపోవడంతో సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. చివరకు హైకోర్టులో కూడా సరాఫత్ కుటుంబానికి చుక్కెదురైంది.ఈ కేసులో సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. సాక్షి వివరాల్లోని స్వల్ప లోపాల ఆధారంగా సేల్ డీల్ చెల్లదని చెప్పలేమని పేర్కొంది. సేల్ డీడ్ ఫోర్జరీ జరిగిందనే ఫిర్యాదు కూడా లేకపోవడాన్ని ఈ సందర్భంగా కోర్టు పేర్కొంది. జమీందారీ చట్టానికి 1981లో చేసిన సవరణలు 1957కు వర్తించవని కూడా పేర్కొంది. నాటి సేల్ డీడ్ చెల్లుతుందంటూ తీర్పు వెలువరించింది.

# వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా

నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు. పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

### ఆగస్టు 15 నుంచి 'సంజీవని'

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన 'సంజీవని' కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక అని, దీని ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను అనుసంధానం చేస్తామని వివరించారు. ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు కూడా మంచి ఆహారం, వ్యాయామం, యోగా వంటి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

### బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. నలుగురు వ్యక్తులు స్వేచ్ఛగా మాట్లాడుకోలేని భయానక వాతావరణం ఉండేదని, బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయని విమర్శించారు. నేడు ఆ పరిస్థితి మారిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడ్డాయని స్పష్టం చేశారు.మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతుల కోసం మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

### యువత, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

రామాయపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేసి, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చి, పండ్ల తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు వాడటం వల్ల మన ఉత్పత్తులు అంతర్జాతీయంగా తిరస్కరణకు గురవుతున్నాయని, అందుకే ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు డీబీవీ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు.బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం-1955, పాస్‌పోర్ట్ చట్టం-1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు: అమిత్ షా

ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

భారత శక్తి

## వాషింగ్ మెషిన్‌గా మారుతున్న అధికార పక్షం

ఎమర్జెన్సీని ప్రకటించి 51 సంవత్సరాలు గడిచినా, భారతదేశం తన ప్రజాస్వామ్య చరిత్రలోని అత్యంత వివాదాస్పద అధ్యాయాలలో ఒకదానిపై చర్చను కొనసాగిస్తోంది. ఆ చర్చ సమంజసమే కావచ్చు. ఎమర్జెన్సీ పరిశీలన, విమర్శ, చారిత్రక పరిశీలనకు అర్హమైనది. అయితే, ప్రజలు, చరిత్ర రెండూ ఎప్పుడో తీర్పు వెలువరించిన ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, భారతీయ జనతా పార్టీ దీనిని ఒక సమకాలీన రాజకీయ సమస్యగా ఎందుకు పరిగణిస్తూనే ఉందనేది అంత సులభంగా అర్థం కాని విషయం. వాస్తవానికి, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇటీవల వెనకడుగు వేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది బిజెపియే. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మీడియా యాజమాన్యంలోని ఒక పెద్ద విభాగంపై ఉక్కుపిడికిలి బిగించడం, ఆశ్రితపెట్టుబడిదారీ విధానం, సంస్థల గొంతు నొక్కడం, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం - ఇవన్నీ ఎమర్జెన్సీ లక్షణాలు, ఇవి ఇప్పటికీ అమలులో ఉన్నాయి. కాంగ్రెస్ సమకాలీకులలో చాలామంది కూడా, ఎమర్జెన్సీ గురించి లోతుగా పరిశోధించడానికి లేదా చర్చించడానికి తరచుగా ఇబ్బందిపడతారు. ఎమర్జెన్సీ దోషరహితమైనదని కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ వాదించలేదు. దశాబ్దాలుగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లతో సహా దాని అగ్ర నాయకత్వం, ఆ కాలంలో జరిగిన దురాగతాలను బహిరంగంగా అంగీకరించింది. ఇందిరా గాంధీ స్వయంగా 1977లో ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పును కోరారు. ఓడిపోయినప్పుడు ఓటర్ల తీర్పును అంగీకరించారు. ఆమె స్వయంగా మరో వేయేళ్లు వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితి రాదనీ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకత్వం చరిత్రలోని ఆ అధ్యాయం పట్ల పదేపదే విచారం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, ప్రతి సంవత్సరం, ముఖ్యంగా జూన్ 25వ తేదీ చుట్టూ, బిజెపి ఎమర్జెన్సీని ఒక రాజకీయ ఆయుధంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. దీని ఉద్దేశం చారిత్రక పరిశీలన కాదు. ఇది ఒక రాజకీయ సమీకరణ.తన వర్తమానంపై విశ్వాసం ఉన్న ప్రభుత్వం, తన పరిపాలన ద్వారా ప్రజల మెప్పు పొందగలమని ఆత్మవిశ్వాసం గల ప్రభుత్వం, దాదాపు అర్ధ శతాబ్దం క్రితం ఉనికిలో లేకుండాపోయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేయవలసిన అవసరం ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయదారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16- 17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లోని కియోస్క్‌లు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ఇదే తరహా చర్యలు మే 16న హౌరాలో, మే 31 రాత్రి దమ్ దమ్ జంక్షన్‌లో, జూన్ 7- 8 తేదీల రాత్రి జాదవ్‌పూర్‌లో జరిగాయి. జాదవ్‌పూర్‌లో, వీధి వ్యాపారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల కార్యకర్తలు బుల్డోజర్ల ముందు శాంతియుతంగా కూర్చున్నప్పుడు, వారిపై లాఠీచార్జీలు,అరెస్టులు జరిగాయి. వృద్ధ వీధి వ్యాపారులు తమ జీవితపు ఆనవాళ్ల కోసం శిథిలాలలో వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులకు సంఘీభావం తెలిపినందుకు విద్యార్థులు, కార్యకర్తలను కొట్టారు. ప్రభావిత వర్గాలు చర్చలకు వెళ్ళినప్పుడు, వారిని పట్టించుకోలేదు. వారి డిమాండ్ చాలా సరళమైనది:ఉత్తరప్రదేశ్ నుండి మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ వరకు, కూల్చివేత చర్యలను పట్టణ ప్రణాళిక సాధనాలుగా కాకుండా, ప్రభుత్వ ఆధిపత్య ప్రదర్శనలుగా ప్రయోగించారు. ఇవి ప్రధానంగా శ్రామిక పేదలు, వలస కార్మికులు, అసంఘటిత కార్మికులను (తరచుగా మైనారిటీలు) లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ప్రతిఘటించడానికి అతి తక్కువ వనరులు, అతి తక్కువ రాజకీయ రక్షణ ఉంటాయి. ప్రయోగించిన ప్రతి బుల్డోజర్‌తో, తాను పనికిరానివారిగా భావించిన వారిపై బలాన్ని ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నానని బిజెపి తన 'బేస్'కు సంకేతం ఇస్తుంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ఒక వర్గం వారి ఇల్లు లేదా జీవనోపాధి రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోయిన ప్రతిసారీ ప్రజాస్వామ్య జవాబుదారీతనం క్షీణిస్తుంది. గత ఐదేళ్లలో భారతదేశవ్యాప్తంగా కూల్చివేతలు 379% పెరిగాయని పరిశోధనా సంస్థలు నమోదు చేశాయి. నేడు అధికార కేంద్రీకరణ శృతిమించిపోతుంది.

ప్రజాస్వామ్యంలో నిరసనలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం కీలకం. అయితే, కీలక నిర్ణయాల విషయంలో సహితం మంత్రివర్గంలో కూడా సవివరంగా చర్చలు ఉండటం లేదు. అధికార పక్షం 'వాషింగ్ మెషిన్'గా మారిపోయింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం కావించడమే కాగలదు. ఎమెర్జెన్సీలో మాదిరిగా న్యాయవ్యవస్థ సైతం నిస్సహాయంగా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతుంది.

# రేపే పల్స్ పోలియో.. రంగారెడ్డి జిల్లాలో సర్వం సిద్ధం

### ఐదేళ్లలోపు చిన్నారుల లక్ష్యం 4.20 లక్షలు । 1,688 బూత్‌ల ఏర్పాటు.

రంగారెడ్డి జిల్లా, జూన్ 27:భారత శక్తి, జిల్లా వ్యాప్తంగా జూన్ 28 (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో ఐదేళ్లలోపు వయసున్న 4,20,911 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణను రూపొందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ స్వర్ణ కుమారి తెలిపారు.

**1,688 పోలియో బూత్‌ల ఏర్పాటు**

చిన్నారులకు టీకాలు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,688 పోలియో బూత్‌లను సిద్ధం చేశారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 493, గ్రామీణ ప్రాంతాల్లో 1,195 బూత్‌లను ఏర్పాటు చేశారు. వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు 43 కోల్డ్ చైన్ కేంద్రాలు, 2,010 వ్యాక్సిన్ క్యారియర్లు, అవసరమైన ఐస్ ప్యాక్‌లను అందుబాటులో ఉంచారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు**

కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.
- రవాణా, ప్రచారం: 167 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 55 ప్రచార వాహనాలను రంగంలోకి దించారు.
- మొబైల్ & ట్రాన్సిట్ టీమ్స్: ప్రయాణాల్లో ఉండే పిల్లల కోసం 53 ట్రాన్సిట్ పాయింట్లు, సుదూర ప్రాంతాల కోసం 50 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు.

**-అధికారుల పర్యవేక్షణ:**


12 మంది జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తారు.

**- హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో గుర్తించిన 481 హైరిస్క్ (అధిక ముప్పు ఉన్న) ప్రాంతాలపై వైద్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న 6,213 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు వంద శాతం పోలియో చుక్కలు అందేలా చూసేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు.

**- రంగంలోకి 4 వేలకు పైగా సిబ్బంది**

ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ఆరోగ్య, అనుబంధ విభాగాల సిబ్బందిని భాగస్వాములను చేశారు.
- 6 మంది ప్రోగ్రామ్ అధికారులు, 5 మంది డిప్యూటీ డీఎంహెచ్‌వోలు.
- 54 మంది వైద్యాధికారులు, 153 మంది సూపర్వైజర్లు.
- 61 మంది స్టాఫ్ నర్సులు, 474 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు.
- 1,317 మంది ఆశా (ASHA) కార్యకర్తలు, 1,600 మంది



అంగన్‌వాడీ కార్యకర్తలు/ఆయాలు.
- 604 మంది నర్సింగ్ విద్యార్థులు విధుల్లో పాల్గొననున్నారు.

**- తల్లిదండ్రులకు విజ్ఞప్తి:**

"ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా సమీపంలోని పోలియో బూత్‌లో చుక్కలు వేయించాలి. ఇప్పటికే సాధారణ టీకాలు (Routine Immunization) తీసుకున్న పిల్లలకు కూడా ఈ చుక్కలు వేయించడం అత్యవసరం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి."

**డాక్టర్ స్వర్ణ కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి**

# బొల్లారంలో ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..





బొల్లారం జూన్ 27 భారత శక్తి అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బొల్లారం డివిజన్ వార్డు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. స్వయం సహాయక గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిర మహిళా శక్తి చీరలను పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతిలో స్వయం సహాయక సంఘాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలతో మరింత అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు,

## హెలెన్ కెల్లర్ ఆశయాలు వికలాంగులకు స్ఫూర్తి

- నర్సాపూర్ వికలాంగుల పునరావాస కేంద్రంలో హెలెన్ కెల్లర్ జయంతి
- దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి
- ఏ పీ ఎం సంగమేశ్వర్



నర్సాపూర్, జూన్ 27 భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా కేంద్రంలో హెలెన్ కెల్లర్ జయంతి కార్యక్రమాన్ని నర్సాపూర్ వికలాంగుల పునరావాస కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ప్రపంచవ్యాప్తంగా వికలాంగుల హక్కుల సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు హెలెన్ కెల్లర్ జయంతి కార్యక్రమాన్ని నర్సాపూర్ వికలాంగుల పునరావాస కేంద్రంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె సేవలను స్మరించుకుంటూ పలువురు వక్తలు ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా వికలాంగులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ సందర్భంగా మండల ఏపీఎం సంగమేశ్వర్, జిల్లా ఏపీఎం వెంకటస్వామి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ ప్రపంచ చరిత్రలో చెరగని ముద్ర వేసిన అసాధారణ మహిళ అని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే తీవ్రమైన అనారోగ్యానికి గురై చూపు, వినికిడి, మాట కోల్పోయినా ఏమాత్రం నిరాశ చెందకుండా తన ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషితో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.అంధులు, బధిరులు, మూగవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని, వికలాంగుల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ఉద్యమకారిణిగా హెలెన్ కెల్లర్ పేరు ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. శారీరక వైకల్యం విజయానికి అడ్డంకి కాదని, మనిషిలో ఉండాల్సింది దృఢ సంకల్పం, ఆత్మస్థైర్యం, కృషి మాత్రమేనని ఆమె జీవితం ద్వారా నిరూపించిందని పేర్కొన్నారు.ప్రతి వికలాంగుడు హెలెన్ కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నిరాశకు లోనుకాకుండా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మగౌరవంతో జీవించాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు కూడా వికలాంగులకు అండగా నిలిచి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని కోరారు.హెలెన్ కెల్లర్ రచించిన "ది స్టోరీ ఆఫ్ మై లైఫ్" ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గ్రంథమని, ఆమె జీవిత గాథ నేటికీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోందని వక్తలు వివరించారు. విద్య, సేవ, మానవతా దృక్పథంతో ప్రపంచానికి మార్గదర్శకురాలిగా నిలిచిన హెలెన్ కెల్లర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి సంపూర్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి జ్యోతి, సీబీఆర్ వర్కర్ సుజాత, సీసీలు నాగరాజు, నర్సింలు, దేవిసింగ్, ప్రవీణ్, రవీందర్, అకౌంటెంట్ మల్లేష్, ఆపరేటర్ సురేష్, వివిధ గ్రామ సంఘాల వీవోలు, వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో హెలెన్ కెల్లర్ ఆశయాలను జీవితంలో ఆచరిస్తూ వికలాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తీర్మానించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్




మెదక్ జిల్లా, నర్సాపూర్, జూన్ 27 (భారత్ శక్తి న్యూస్): నర్సాపూర్ మండలంలోని ఇబ్రాహీంబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కల సాకారం కావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేయాలని అధికారులను కోరారు. లబ్ధిదారులు తమ కొత్త ఇంటిలో సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'సర్' కార్యక్రమంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వోలు

**ఇంటింటికీ వెళ్లి వివరాల ధృవీకరణ..**

**అవసరమైన పత్రాలపై సూచనలు**




ఎల్బీనగర్,జూన్ 27 (భారత శక్తి): ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా,సరూర్ నగర్ మండల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఇంటింటికి వెళుతూ, ప్రతీ వారికి కలుస్తున్న మండల్ రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జ్యోతి, బీఎల్ఓ లీలా కుమారి, తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.ఓటరు జాబితాలో ఉన్న వివరాలను ధృవీకరించుకోవడం, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడం, పేరు, చిరునామా, వయస్సు వంటి వివరాల్లో మార్పులు అవసరమైతే దరఖాస్తు చేసుకోవడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు వివరంగా తెలియజేస్తున్నారు. అలాగే అవసరమైన దరఖాస్తు ఫారాలు ఎలా నింపాలి, ఏయే పత్రాలు జత చేయాలి, నిర్ణీత గడువులోగా వివరాలు సమర్పించాల్సిన అవసరం ఏమిటనే విషయాలను కూడా బీఎల్‌వోలు వివరిస్తున్నారు. ఓటర్లందరూ బీఎల్‌వోలతో సహకరించి సరైన సమాచారం అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వెంటనే వాటిని సరిదిద్దుకునేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.ప్రజలు తమ ఇంటికి వచ్చే బీఎల్‌వోలకు అవసరమైన పత్రాలు అందించి వివరాల ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జ్యోతి విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, ఖచ్చితంగా ఉండాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా.



ఉమ్మడి అదిలాబాద్, జిల్లా బ్యూరో జూన్ 27 (భారత శక్తి): రైతు భరోసా పథకం ప్రయోజనాలను పొందేందుకు అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం సూచించారు. జూన్ 15, 2026 నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులందరూ రైతు భరోసా పథకానికి అర్హులని ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 5, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు.రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు, గుర్తింపు కార్డు (ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం) నకళ్లను జతచేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకం ప్రయోజనాలను పొందాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు.

## బద్ది పోచమ్మ ఆలయంలో అక్రమ వసూళ్లపై విచారణ జరపాలి: దండు వినోద్



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 27: వేములవాడలోని శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల నుండి సాగుతున్న అక్రమ వసూళ్లపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి ఈఓ కి ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దండు వినోద్ మాట్లాడుతూ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టే చోట, ఇతర సేవల వద్ద ఎలాంటి అధికారిక రుసుము పట్టికలు లేకుండా భక్తుల నుండి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాలపై దినపత్రికల్లో ఆధారాలతో సహా కథనాలు వచ్చినప్పటికీ ఆలయ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. రశీదులు లేకుండా సాగుతున్న ఈ వసూళ్లు భక్తులకు తీవ్ర ఇబ్బంది కలిగించడమే కాకుండా ఆలయ ప్రతిష్టను మసకబారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఈఓకు సమర్పించిన వినతిపత్రంలో పత్రికా కథనాలపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరపాలని, కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంతో పాటు ఆలయ ప్రాంగణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భక్తుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, అధికారిక కౌంటర్ల ద్వారా రశీదులతో కూడిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని కోరారు. ఆలయ సేవల ధరల పట్టికలను భక్తులకు కనిపించేలా బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, అక్రమ వసూళ్లపై తీసుకున్న చర్యలను బహిరంగపర్చి భక్తుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆలయ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఈ సమస్యపై అత్యవసరంగా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని దండు వినోద్ ఆలయ అధికారులను కోరారు.

## దామరంచ పల్లెలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం.



రేగొండ, జూన్ 27 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం దామరంచ పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ జిల్లెల్ల సామెల్, ఉప సర్పంచ్ మొట్టే రమా, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మొట్టె కిరణ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. పోచమ్మ తల్లి టెంపుల్ నుంచి మసీదు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. చాలా కాలంగా శిథిలవస్థకు చేరిన ఈ రహదారి బాగాలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ జిల్లెల్ల సామెల్, గ్రామ అధ్యక్షులు మొట్టె కిరణ్ తెలిపారు. గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభం కావడంతో గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కడపక రవి, పిఏసిఎస్ డైరెక్టర్ బోట్ల మధుసూదన్, ఐకెపి ఇంచార్జ్ బొట్ల రమేష్, సీనియర్ నాయకులు ధోనికెల సమ్మయ్య, మొట్టే ఐలయ్య, ఎండి నాసర్, బోట్ల భద్రయ్య, మొట్టే తరుణ్, మొగిలి, బొట్ల రాజు, ఇనుముల రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల సమస్యకు మంత్రి పరిష్కారం

**కరీంనగర్,(భారత శక్తి)** బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కొత్త సర్వీసు ప్రారంభించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపించారు. దీంతో ఆ మార్గంలోని గ్రామాలు.. గత 15 ఏళ్లుగా బస్సు కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. దీంతో వారు మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా తమ మార్గంలో బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరినా.. ఎవరూ పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి తమ గోడు విని స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత యుగంలో ప్రజల జీవనశైలి శరవేగంగా మారిపోతున్నా.. కొన్ని మారుమూల ప్రాంతాలు మాత్రం వెనకబడిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ప్రశ్నలకు దారితీస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలాంటి గ్రామాలకు మౌలిక వసతుల కల్పన జరిగితే.. ఆ జనాల్లో వచ్చే ఆనందాలే వేరు. ఇలా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వారి దీనస్థితిని చూసి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు రంగంలోకి దిగి.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి వారి మోహాల్లో చిరునవ్వులు చిందేలా చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వారికి బస్సు సౌకర్యం వచ్చింది. ఈ బస్సు సర్వీసు జగిత్యాల నుంచి ప్రారంభమై.. వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు గతంలో నడిచేది. కానీ ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆ మార్గంలో ఉండే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే తమకు తిరిగి బస్సు సౌకర్యం కల్పించాలని.. గత 15 ఏళ్లుగా ఎంతోమందికి విజ్ఞప్తులు, వినతులు పెట్టుకున్నారు.ఈ క్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని వారికి తిరిగి బస్సు సౌకర్యం కల్పించారు

# పటిష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



రేగొండ, జూన్ 27 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ సుజాత ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలు, రిజిస్టర్ లో నమోదులు, యాప్ ఎంట్రీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 ఓటరు జాభితా ప్రకారం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నదని తెలిపారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని అందులో ఉన్న వివరాలు నమోదు చేయాలని ఓటర్లకు అవగహన కల్పించారు. బూత్ స్థాయి అధికారి వద్ద ఓటరు జాభితా ఉంటుందని ప్రతి ఒక్కరు తమ పేర్లు పరిశీలించాలని తెలిపారు. జాబితాలో పరిశీలన అలాగే అనర్హులైన వారి పేర్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు. ఓటరు జాబితా పరిశుద్ధత ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు తమ పేరు నమోదు చేయించుకోవడమే కాకుండా, మరణించిన వారు, మారిన వారు వంటి అనర్హుల వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ఎన్నికల శాఖ ప్రత్యేకంగా చేపట్టిన సర్వే కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రజలు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కోరారు. అదేవిధంగా, యువత 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల ద్వారా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. జిల్లాలో స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రం 223 పరిధిలో 1171 మంది ఓటర్లున్నారని వారందరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చిన వ్యక్తులకు అక్నాలెడ్జ్ ఇవ్వాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పర్యవేక్షణ చేస్తారని ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ సమీక్ష.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 27 (భారత శక్తి )భైంసా: రాష్ట్ర నిషేధ ఊ ఎక్సైజ్, పర్యాటకం, సంస్కృతి మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భైంసా మున్సిపాలిటీ (ముధోల్ నియోజకవర్గం) పర్యటన నేపథ్యంలో భైంసా సబ్ కలెక్టర్ అధ్యక్షతన శనివారం ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభివృద్ధి పనులు, భద్రత, రవాణా, పారిశుధ్యం తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. పర్యటన విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, మంత్రి పర్యటనలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పవన్ చంద్ర, భైంసా మున్సిపల్ కమిషనర్ ఎం. లింగయ్య, ఆర్ ఊ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఆర్. సుభాష్ బాబు, భైంసా ఎంపీడీఓ టి. నీరజ్ కుమార్, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. గంగాధర్, టీఎంసీ కమిషనర్ కె. దత్తాత్రి, ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. భీమ్ రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం


**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**బీరంగూడ మారుతి నగర్ కాలనీలో ఘనంగా**

**శ్రీ లక్ష్మి గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం..**



అమీన్‌పూర్ జూన్ 27 భారత శక్తి పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో



ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై యువజన కాంగ్రెస్ నిరసన

### - సిరిసిల్ల బ్రిడ్జిపై బైఠాయింపు.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 27: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా, విద్యార్థుల ఆవేదనను తెలియజేస్తూ 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో భాగంగా యువజన కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల బ్రిడ్జిపై శనివారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు బ్రిడ్జిపై బైఠాయించి నినాదాలు చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష లీకేజీ ఉదంతం వల్ల మనస్తాపానికి గురై దేశవ్యాప్తంగా 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, పరీక్షలను నిష్పక్షపాతంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్కా రాజశేఖర్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలన్నారు. సుమారు 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ఈ చేతగానితనాన్ని, మోసాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాదాపు 80కి పైగా పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోతే జాతీయ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధులు రెడ్డిమళ్ళ భాను, గుడిసె ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగం మురళి, శేఖర్ శౌర్య నాయక్, ఎడ్ల తిరుపతి, వేములవాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు పోగుల దేవరాజు రెడ్డి, తంగలపల్లి మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు గంగోల్ల స్వామి, నాయకులు చుక్క రామస్వామి, దండుగుల శేఖర్, నక్క సాయి, ఎండీ సోహెల్, నక్క నవీన్, శ్యాగ కుమార్, రాగుల చరణ్, షేక్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు..

### తప్పకుండా వేయించండి: జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా






నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 27:(భారత శక్తి) జిల్లాలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, గతంలో ఎన్ని సార్లు వేయించినా మరోసారి వేయించడం వల్ల ఎలాంటి హాని ఉండదని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు బస్ స్టాండ్లలో కూడా ప్రత్యేక పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రయాణంలో ఉన్న కుటుంబాలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.జిల్లాలోని ప్రతి చిన్నారి పోలియో చుక్కలు తీసుకునేలా ప్రజలు ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించి, "పోలియో రహిత నిర్మల్ జిల్లా" లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ భావేష్ మిశ్రా కోరారు.

# పెరుగు, కీరా.. ఫహాడీ రైతా.. అరగంట ఫ్రిజ్‌లో సర్వ్ చేసుకుంటే!

పెరుగు, కీరా కలగలసిన ఫహాడి రైతా తయారీ విధానం తెలుసా?

### ఫహాడి రైతా తయారీకి కావల్సినవి

పెరుగు రెండు కప్పులు,కీరా ఒకటి,ఆవాలు టీస్పూను,పచ్చిమిర్చి రెండు,ఆవ నూనె పావు కప్పు,కొత్తిమీర గుప్పెడు,కారం టీస్పూను,పసుపు అరటీస్పూను,ఉప్పు రుచికి సరిపడా.

### తయారీ...

తొక్క, గింజలు తీసిన కీరాను సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి.పెరుగును పెద్దగిన్నెలో వేసి కవ్వంతో చిలకాలి.

తరువాత పావు కప్పు నీళ్లుపోసి కలపాలి.ఇప్పుడు ఆవాలు, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా దంచుకోవాలిదంచిన మిశ్రమం, కీరా తరుగుని చిలికిన పెరుగులో వేయాలి.పసుపు, కారం కూడా వేసి చక్కగా కలుపుకోవాలి.దీనిని అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత సర్వ్ చేసుకోవాలి.



# ఉత్తరాఖండ్ వంటకం

## ఆలుకీ గుట్కే తయారీ ఇలా!

### ఆలుకీ గుట్కే

ఉత్తరాఖండ్ వంటకం ఆలుకీ గుట్కే ఇలా తయారు చేసుకోండి.

**ఆలుకీ గుట్కే తయారీకి కావలసినవి:**బంగాళ దుంపలు మూడు,ఆవనూనె రెండు టీస్పూన్లు,కారం పావు టీస్పూను,ధనియాలపొడి రెండు టీస్పూన్లు,జీలకర్ర పావు టీస్పూను,పసుపు పావు టీస్పూను,ఎండు మిర్చి రెండు,ఇంగువ రెండు చిటికెలు,ఉప్పు రుచికి సరిపడా,కొత్తిమీర తరుగు గార్నిష్‌కు సరిపడా.

**తయారీ...:**కొద్దిగా ఉప్పువేసి బంగాళ దుంపలను ఉడికించాలి.ఉడికిన దుంపల తొక్క తీసి ముక్కలు తరగాలి.చిన్న గిన్నెలో ధనియాల పొడి, కారం, పసుపు, రెండు టీస్పూన్ల నీళ్లుపోసి చక్కగా కలపాలి.స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేయాలి. నూనె కాగాక జీలకర్ర, ఇంగువ, కారం వేసి అరనిమిషం పాటు వేయించాలి.ఇప్పుడు బంగాళ దుంపల ముక్కలు, కలిపి పెట్టుకున్న మసాలా మిశ్రమం, రుచికి సరిపడా ఉప్పు వేసి ఐదు నిమిషాలపాటు వేయించాలి.చివరిగా కొత్తిమీర చల్లుకుని దించేయాలి.



# శుక్లం శాపం,

## దృష్టి లోపం.. కారణాలు, లక్షణాలు, చికిత్స

కంటిశుక్లం అత్యంత విలువైన కంటి చూపును తగ్గించే తీవ్రమైన సమస్య. దీనిపై ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఇది నిదానంగా పెరిగే సమస్య కావడం వల్ల చాలామంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా సమస్య తీవ్రత పెరిగేందుకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కంటి శుక్లం శస్త్రచికిత్స/క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరం...పై అపోలో స్పెక్ట్రా ఆసుపత్రికి చెందిన వైద్యులు, ప్రముఖ క్యాటరాక్ట్ సర్జన్ డా. అల్పా అతుల్ పూర్బియా అందిస్తున్న సమాచారం ఇది...కంటి శుక్లం..కారణాలు...కంటి లెన్స్ పుట్టుకతో స్పష్టంగా ఉంటుంది, ప్రధానంగా నీరు మరియు ప్రోటీన్లతో కూడి ఉంటుంది. ప్రోటీన్లు కాలక్రమేణా విచ్ఛిన్నం కావడంతో, లెన్స్ తెల్లగా లేదా బూడిద రంగులోకి మారడం ప్రారంభిస్తుంది, ఇది స్పష్టమైన చూపును నిరోధిస్తుంది. దీనికి సాధారణంగా వయస్సు పెరగడం కాగా, అతినీలలోహిత కిరణం/సూర్య కాంతికి గురికావడం వంటివి కూడా కంటిశుక్లంను ప్రేరేపించడానికి కారణాలే. ఇక ఇతర కారణాలలో అతిగా ధూమపానం, దీర్ఘకాలిక మధుమేహం, దీర్ఘకాలిక స్టెరాయిడ్స్ వాడకం వంటివి కూడా ఉండవచ్చు. అలాగే ఆల్కహాల్ దుర్వినియోగం, ఊబకాయం, రేడియేషన్ థెరపీ మొదలైనవి కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తు కంటికి అయిన గాయాలు కూడా కంటిశుక్లం వృద్ధికి కారణం కావచ్చు. కొన్ని సార్లు పుట్టుకతో కూడా కంటిశుక్లం వచ్చే అవకాశం ఉంది. చాలా అరుదుగా పిల్లలలో అభివృద్ధి చెందే కంటిశుక్లంని డెవలప్‌మెంటల్ క్యాటరాక్ట్ అంటారు.గుర్తించాల్సిందే...కంటిశుక్లం నిదానంగా అభివృద్ధి చెందే గుణం కలిగి ఉంటుంది కాబట్టి ముందుగా జాగ్రత్త పడడం కష్టమవుతుంది. దీనిని ముందుగా గుర్తించడానికి రాత్రిపూట దృష్టికి అంతరాయం, తక్కువ కాంతిలో చూడటం కష్టతరం అవడం వంటి లక్షణాలు ఉపకరిస్తాయి. కంటి శుక్లం ఉన్న రోగులు సాధారణంగా లైట్ చుట్టూ ఒక కాంతిని చూస్తారు. అలాగే కంటి శుక్లం ఉన్నప్పుడు ప్రకాశవంతమైన లైట్ల మెరుపు బాధాకరంగా ఉంటుంది, కంటిశుక్లం ఉన్న వ్యక్తులు ప్రకాశవంతమైన సూర్యకాంతిలో సరిగ్గా చూడటం కష్టంగా ఉండవచ్చు లేదా రాత్రి సమయంలో కొన్నిసార్లు మరింత చెదిరిన దృష్టిని గమనించవచ్చు. వారికి ఇండోర్ లైట్లలో కూడా చూపు కష్టంగా ఉండవచ్చు. వీధి లైట్లు



ఎదురుగా వచ్చే వాహనాల నుండి వచ్చే హెడ్‌లైట్ల వల్ల కలిగే కాంతి కారణంగా రాత్రి సమయంలో డ్రైవింగ్ సమస్యగా మారవచ్చు. కంటిశుక్లం బాగు చేసేందుకు మందులతో చేయగలిగిన వైద్య చికిత్స లేదు. మసకబారిన చూపును, దృష్టిని పునరుద్ధరించడానికి శస్త్రచికిత్స ద్వారా కంటిశుక్లం తొలగించడమే మార్గం. . కంటిశుక్లం లక్షణాలు స్వల్పంగా ఉన్నట్లయితే, అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరం కావచ్చు, కానీ కాలక్రమేణా కంటిశుక్లం మరింత తీవ్రమవుతుంది. తర్వాత తర్వాత సాధారణ రోజువారీ కార్యకలాపాలకు కూడా ఇది ఆటంకం కలిగిస్తే శస్త్రచికిత్స చేయక తప్పదు. కంటిశుక్లం తొలగింపు శస్త్రచికిత్స ప్రక్రియను ఇంట్రాకోక్యులర్ లెన్స్ ఇంప్లాంటేషన్స్ తో ఫాకోఎమల్సిఫికేషన్ అంటారు. ఈ ప్రక్రియలో, కంటిశుక్లం వృద్ధి చెందిన అసలు లెన్స్, కృత్రిమ (ఇంట్రాకోక్యులర్ లెన్స్)తో భర్తీ చేయబడుతుంది. ఇది చాలా సురక్షితమైన ప్రక్రియ. ఈ శస్త్రచికిత్స తర్వాత కొన్ని రోజుల పాటు దురద, తేలికపాటి అసౌకర్యం కంటిలో నీరు కారడం వంటివి కనిపించవచ్చు.అయితే నేడు అందుబాటులో ఉన్న తాజా సాంకేతికతతో విజువల్ రికవరీ చాలా వేగంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత కోలుకునే కాలం ఒకరి నుండి మరొకరికి భిన్నంగా ఉండవచ్చు. కొంతమంది కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు, మరికొందరికి కోలుకోవడానికి వారాలు పడుతుంది. ఇతరత్రా సమస్యలు లేనట్లయితే వైద్యులు ఒక వారం విశ్రాంతిని సిఫార్సు చేస్తారు. సాధారణంగా అయితే కొన్ని గంటలలోపే, కంటిలో కాలుష్యం లేదా ధూళి కణాలు ప్రవేశించకుండా నిరోధించడానికి రోగిని రక్షించే గ్లాస్ లేదా కంటికి ఐ ప్యాడ్‌తో ఇంటికి తిరిగి పంపుతారు.

# వంట నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారా?

## ఎంత డేంజరో తెలుసా..

పెదవాల్తేరు(విశాఖపట్నం): ఇంట్లోను, హొటళ్లలోను ఒకసారి వినియోగించిన వంట నూనెను పదేపదే ఉపయోగించడం పరిపాటి. కానీ అలా చేయడం ఆరోగ్యానికి హానికరం అన్న విషయం చాలా మందికి తెలియదు. దీనిపై ఇప్పుడిప్పుడే అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. వాడిన వంటనూనెతో తయారైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులు, లివర్ జబ్బులు, హైపర్‌టెన్షన్, అల్జీమర్ వంటి వ్యాధులు సోకుతాయని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.చదవండి: మీకు తెలుసా?.. విద్యుత్ శాఖ నుంచి మెసేజ్‌లు రావు .కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఒకసారి వాడిన వంట నూనెను కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే విశాఖలోని పలు హొటళ్లలోను, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలోను వాడిన వంటనూనె సేకరణ కోసం డ్రమ్ములు కూడా ఏర్పాటు చేశారు. లీటర్ అయిల్‌కు రూ.30 వంతున చెల్లిస్తారు. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హొటల్ యజమానులు వాడిన వంటనూనె విక్రయాల కోసం సదరు సంస్థను సంప్రదించాలని ఆహార భద్రత శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ నూనె సాయంతో బయోడీజిల్ తయారు చేస్తారు. ఫలితంగా పెరుగుతున్న చమురు ధరల నుంచి ఉపశమనం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



# ఆరిక అన్నం అత్యంత

## బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం..

ఆరిక అన్నం ఇంటిల్లపాదికీ అత్యంత బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం. ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట ఆరిక మాత్రమే. ఆరిక 160–170 రోజుల పంట. విత్తిన తర్వాత దాదాపు 6 నెలలకు పంట చేతికి వస్తుంది. ఆరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం.మొలిచిన తర్వాత 40–50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుంది. ఇతర పంటలు అంతగా నిలవ్వు. చిరుధాన్యాల్లో చిన్న గింజ పంటలు (స్మాల్ మిల్లెట్స్).. ఆరిక, కొర్ర, సామ, ఊద, అండుకొర్ర. ఆరిక మినహా మిగతా నాలుగు పంటలూ 90–100 రోజుల్లో పూర్తయ్యేవే.చిరుధాన్యాల సేంద్రియ సాగులో అనుభవజ్ఞుడు, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ ‘సాక్షి సాగుబడి’కి వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో ఆరికల సాగులో మెలకువలను ఆయన మాటల్లోనే ఇక్కడ పొందుపరుస్తున్నాం...ఆరిక విత్తనాలు ఒక్క వర్షం పడి తేమ తగలగానే మొలుస్తాయి. ఒక్కసారి మొలిస్తే చాలు. గొర్రెలు తిన్నా మళ్లీ పెరుగుతుంది ఆరికె మొక్క. మొలిచిన తర్వాత దీర్ఘకాలం వర్షం లేకపోయినా తట్టుకొని బతకటం ఆరిక ప్రత్యేకత. మళ్లీ చినుకులు పడగానే తిప్పుకుంటుంది. అందువల్ల సాధారణ వర్షపాతం కురిసే ప్రాంతాలతో పాటు అత్యల్ప వర్షపాతం కురిసే ప్రాంతాలకూ ఇది అత్యంత అనువైన పంట. నల్ల కంకి సమస్యే ఉండదు. ఆరిక పంటకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అవసరం లేదు. పొలాన్ని దుక్కి చేసుకొని మాగిన పశువుల దిబ్బ ఎరువు ఎకరానికి 4–5 ట్రాక్టర్లు(12 టన్నులు) వెదజల్లాలి. లేదా గొర్రెలు, మేకలతో మందగట్టడం మంచిది. గొర్రెలు, మేకలు మూత్రం పోసిన చోట ఆరిక అద్భుతంగా దుబ్బు కడుతుంది. శ్రీవరి సాగులో మాదిరిగా 30–40 పిలకలు వస్తాయి. పొలాన్ని దుక్కి చేసి పెట్టుకొని.. మంచి వర్షం పడిన తర్వాత ఆరికెలను విత్తుకోవాలి. వెదజల్లటం కన్నా గొర్రుతో సాళ్లుగా విత్తుకోవడం మంచిది. గొర్రుతో విత్తితే విత్తనం సమాన లోతులో పడుతుంది. ఒకరోజు అటూ ఇటుగా మొలుస్తాయి. ఒకేసారి పంటంతా కోతకు వస్తుంది. 8 సాళ్లు ఆరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్లు ఆరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆరిక విత్తనం కావాలి. కంది విత్తనాలు ఎకరానికి ఒకటిన్నర కిలోలు కావాలి. కిలోన్నర కందుల్లో వంద గ్రాములు సీతమ్మ జొన్నలు, 50 గ్రాములు తెల్ల / చేను గోగులు కలిపి విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆముదం విత్తనాలు కావాలి. ఎకరానికి పావు కిలో నాటు అలసందలు /బొబ్బర్లు, అర కిలో అనుములు, వంద గ్రా. చేను చిక్కుళ్లు ఆముదాలలో కలిపి చల్లుకోవాలి. ఆరికలు విత్తుకునేటప్పుడు కిలో విత్తనానికి 4 కిలోల గండ్ర ఇసుక కలిపి విత్తుకోవాలి. ఆరికల విత్తనాలు ఎంత సైజులో ఉంటాయో అదే సైజులో ఉండే ఇసుక కలిపి గొర్రుతో విత్తుకోవాలి. కందులు, ఆముదం తదితర విత్తనాలను అక్కిలి / అక్కిడి కట్టెలతో విత్తుకోవాలి. ఆరికలను మిశ్రమ సాగు చేసినప్పుడు పెద్దగా చీడపీడలేమీ రావు. కషాయాలు పిచికారీ చేయాల్సిన అవసరం రాదు.ఐదారు రకాల పంటలు కలిపి సాగు చేయడం వల్ల చీడపీడలు నియంత్రణలో ఉంటాయి. రైతు కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పంటలూ చేతికి వస్తాయి. ఆహార భద్రత కలుగుతుంది. కంది, సీతమ్మ జొన్న తదితర పంట మొక్కల పిలకలు తుంచేకొద్దీ మళ్లీ చిగుర్లు వేస్తూ పెరుగుతాయి. పక్షి స్థావరాలుగా కూడా ఇవి ఉపయోగపడతాయి. ఆరికలు ఎకరానికి ఎంత లేదన్నా 6–8 క్వింటాళ్లు, కందులు 3 క్వింటాళ్లు, ఆముదాలు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సందేహాలుంటే విజయకుమార్ (98496 48498)ను ఆంధ్రప్రదేశ్ రైతులు ఉ. 6–9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6–9 గం. మధ్య సంప్రదించవచ్చు.



# పంచదార, తేనె, ఆలివ్ ఆయిల్,

## నిమ్మ.. దెబ్బకు జిడ్డు వదులుతుంది!

### ఓజిగట వదిలించే స్క్రబ్

వర్షాకాలంలో పేరుకుపోయిన మృతకణాలతో ముఖం జిగటగా ఉంటుంది. ఈ జిగటను తొలగించే స్క్రబ్‌ను ఇంట్లోనే అత్యంత సులువుగా తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...కప్పు పంచదారలో టీస్పూను తేనె, అరటీస్పూను నిమ్మరసం, టీస్పూను ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా అప్లై చేసి ఆరిన తర్వాత సున్నితంగా మర్దన చేసి నీటితో కడిగేయాలి.వారంలో రెండు సార్లు ఈ స్క్రబ్ అప్లై చేయడం వల్ల జిగటపోయి ముఖచర్మం ఆరోగ్యంగా, కాంతిమంతంగా కనిపిస్తుంది.

### సహజమైన క్లెన్సర్స్


ముఖం మరీ మురికిగా అనిపిస్తే పాలు, మీగడ, పెరుగు, మజ్జిగ ఏది అందుబాటులో ఉంటే దానిని పట్టించి మెల్లగా రుద్దాలి. ఇవి సహజమైన క్లెన్సర్స్.మార్కెట్‌లో దొరికే క్లెన్సింగ్ మిల్క్‌కు బదులుగా వీటిని వాడవచ్చు.రోజూ మామూలుగా ముఖాన్ని శుభ్రం చేస్తున్నప్పటికీ దుమ్ముకణాలు చర్మం లోపలి గ్రంథుల్లోకి వెళ్లి చర్మానిక ి పట్టేస్తాయి.అలాంటప్పుడు కూడా ఈ క్లెన్సర్‌ను వాడవచ్చు.



# ఈ అమ్మాయిని చూసి...

## అడవి ముచ్చటపడింది!

పిల్లలు ఇష్టంగా చదువుకుంటుంటే పెద్దలే కాదు ప్రకృతి కూడా ముచ్చటపడుతుంది. నిండు మనసుతో ఆశీర్వదిస్తుంది!‘నిద్ర సుఖం ఎరగదు’ అంటారు. విద్య కూడా అంతే! ఏసీ గదులలో, మెత్తని సోఫాలలో కూర్చుని చదివితేనే చదువు వస్తుందని ఏమీ లేదు. ఇలా ఎండలో, రాళ్లపై కూర్చొని చదువుకుంటే కూడా చదువు వస్తుంది. అదంతా మన ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. విషయంలోకి వెళితే..హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక అమ్మాయి ప్రకృతి ఒడిలో పాఠ్యపుస్తకం చదువుకుంటున్న ఫోటో పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రాను బాగా ఆకట్టుకుంది. ‘మన్‌డే మోటివేషన్స్’ ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఇన్‌స్పిరేషనల్ పోస్ట్ నెటిజనులను బాగా ఆకట్టుకుంది.‘ఈరోజు నేను హిమాచల్‌ద్రేశ్‌లోని సత్నా ప్రాంతానికి వెళ్లాను. అక్కడ చూసిన ఒక దృశ్యం నన్ను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. ఒక అమ్మాయి శ్రద్ధగా చదువుకుటోంది. నోట్స్ రాసుకుంటోంది. పచ్చటి ప్రకృతి ఆమెను దీవిస్తున్నట్లుగా ఉంది. నిజం చెప్పాలంటే... ఈ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు దొరకడం లేదు’ అంటూ రాసి మురిసిపోయాడు దూబే.‘నిజానికి పిల్లలకు నాలుగు గోడల మధ్య కాకుండా పచ్చటి ప్రకృతి మధ్యే విద్య నేర్పించాలి. ఇలా చేస్తే వారికి ప్రకృతి విలువ తెలుస్తుంది. పర్యావరణ స్పృహ బాల్యం నుంచే కలుగుతుంది. గోడలు లేని బడిలో మనసు విశాలం అవుతుంది. తాత్విక విద్యావేత్తలు ఇదే విషయాన్ని చెప్పారు’ అంటుంది ఒక యూజర్.పెద్దల పోరు భరించలేక చదువుకుంటున్నట్లు కాకుండా... చాలా ఇష్టంగా చదువుకుంటున్నట్లుగా ఉంది.



## అల్లూరి సీతారామరాజు గురుకుల పాఠశాలను సందర్శించిన నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్



మెదక్ జిల్లా, నర్సాపూర్, జూన్ 27 (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గురుకుల పాఠశాలను నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్ శనివారం సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, వారికి అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదుల్లో బోధన విధానం, హాస్టల్ వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను స్వయంగా వినిపించుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌తో సమావేశమైన బుచ్చేష్ యాదవ్ పాఠశాల ప్రస్తుత పరిస్థితులు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, ఇంకా అవసరమైన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులే భవిష్యత్‌లో సమాజానికి ఆదర్శంగా నిలవాలని, వారికి మెరుగైన విద్యా అవకాశాలు, అన్ని రకాల సౌకర్యాలు అందేలా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

### -ఆదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 27 (భారత్ శక్తి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో నిర్మించిన నూతన ఇందిరమ్మ గృహాలను రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు మరియు అజారుద్దీన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, సొంత ఇల్లు లేని ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద ప్రజలు అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడకుండా, తమ సొంత గృహంలో సురక్షితంగా జీవించే అవకాశం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, గృహాలతో పాటు తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతులను కూడా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం మంత్రులు నూతన గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని డీసీ విజ్ఞప్తి



ఎల్బీనగర్, జూన్ 27 (భారత శక్తి): ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో నివసిస్తూ ఇప్పటికే చేయూత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా లైవ్ అథెంటికేషన్ చేయించుకోవాలని, ఈ మేరకు ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, చేయూత పెన్షన్ పొందుతు ఇంకా లైవ్ అథెంటికేషన్ చేయించుకోని లబ్ధిదారులు సోమవారం లోగా సర్కిల్ కార్యాలయానికి వచ్చి లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

### పెన్షనర్ల విజ్ఞప్తి

లైవ్ అథెంటికేషన్ చేసుకోవడానికి వస్తే సర్వర్ వలన ఇబ్బందిగా ఉందని, మధ్యాహ్నం అయితే సర్వర్ పనిచేయడం లేదని, కొంతమంది వృద్ధుల కండ్లు బాలేక ఐరిష్ కావడం లేనందున, మీరిచ్చే పెన్షన్ మాకు జీవనధారం కాబట్టి మాకు అన్యాయం జరుగకుండా, న్యాయం జరిగే విధంగా ఈ మూడు రోజులు సెలవులు అయినందున ఇంకొక వారం రోజులు లైవ్ అథెంటికేషన్ పొడిగించాలని పెన్షనర్లు డిప్యూటీ కమీషనర్ కు విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేసిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



**బద్వేలు(భారత శక్తి)** బద్వేల్ పట్టణంలోని 23వ వార్డుకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ అనారోగ్యానికి గురికావడంతో, వారి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.35,184/- (ముప్పై ఐదు వేల నూట ఎనభై నాలుగు రూపాయలు) విలువైన చెక్కును ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శనివారం బాధితుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాను కల్పిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో తాము కూడా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## సర్వే నెంబర్ 4లో గతంలో నిర్మించిన చెక్ డ్యామ్ ఎక్కడ

### - సిపిఐ ప్రశ్న



**బద్వేలు(భారత శక్తి)** బద్వేల్ మండలం వనంపుల గ్రామపంచాయతీలో సర్వేనెంబర్ 4 దాదాపు 4 ఎకరాలపైబడి వంక పోరంబోకు అక్రమణకు గురైందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ రూరల్ కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేల్ తెలిపారు. శనివారం ఆక్రమణకు గురైన వంక పోరంబోకు భూమిని సిపిఐ బృందం పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... బద్వేల్ మండలం వనంపుల గ్రామపంచాయతీలో సర్వేనెంబర్ 4 నందు 4 ఎకరాల పైబడి వంక ఉందని కొండ నుంచి నీరు ఆ వంకకు వచ్చేందుకు ఎన్ హెచ్ 67 జాతీయ రహదారికి బ్రిడ్జిని నిర్మించి దాని ద్వారా వంకకు నీరు వచ్చే విధంగా అనుకూలంగా గతంలో చేశారని, దానికి అనుకూలంగా ఆ వంకలో నీరు నిల్వ ఉండేందుకు 2004 ప్రభుత్వంలో చెక్ డాం కూడా నిర్మించడం జరిగిందని ఆయన అన్నారు. అయితే కొంతమంది భూకబ్జాదారులు ఆ భూమిపై కన్నేసి నాలుగు ఎకరాల పైబడి ఉన్న వంక ను ఆక్రమించి దొంగ పట్టాలు సృష్టించి 2016లో కొంత 2023లో కొంత భూమి ఆన్లైన్ చేపించుకొని అనుభవిస్తున్నారని, ఆ వంక పోరంబోకులో ఉన్న చెక్ డ్యామ్ను కూడా పూర్తిగా చదును చేసి దానిపైన రోడ్డు మాదిరిగా మొత్తం మట్టి వేసి కప్పడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దాదాపు నాలుగు ఎకరాల పైబడి ఉన్న వంకను పూర్తిగా ఆక్రమణ చేసి మొత్తం ప్లాట్లు వేసి కొంత అమ్మడం కూడా జరిగిందని, ఇంత జరుగుతున్న జాతీయ రహదారి పక్కనే ఉన్న కూడా రెవెన్యూ అధికారులు కానీ వాటర్ షెడ్ అధికారులు కానీ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంతో భూకబ్జాదారులు యదేచ్ఛగా ప్లాట్లు వేసి అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. 2007 సంవత్సరం తర్వాత ఎక్కడ కూడా అసైన్మెంట్ జరగలేదని వీరికి ఏ ప్రాతిపదికన ఆన్లైన్ చేసి పట్టా పాస్ బుక్కులు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. పేదల రెండు సెంట్లు ఆక్రమిస్తేనే ఆగ మేఘాల మీద దాడి చేసే రెవెన్యూ అధికారులకు కోట్ల విలువైన ప్రభుత్వ వంక ఫారం పోకు భూమి ఆక్రమణకు గురైతే కనబడడం లేదా అని ఆయన ప్రశ్నించారు రెవెన్యూ అధికారులు ఈ భూమిపై కన్నెత్తి చూడకపోవడం వెనక ఈ ఆక్రమణలో రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన సిబ్బంది కూడా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలను విచారించి ఈ ఆక్రమణంలో రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన సిబ్బంది ఎవరైనా ఉన్నా వారిని వెంటనే విధుల నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే కుంటను ఆక్రమించి అక్రమంగా ఆన్లైన్ చేసిన వారిపై అదేవిధంగా చెక్ డ్యామ్ ను పూర్తిగా తొలగించి కనుమరుగు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వంక ఫారంపోకు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే సిపిఐ రూరల్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఐ రూరల్ నాయకులు సుధాకర్, ప్రసాద్, వెంకటరమణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు

## బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్ ఎన్నిక

**జమ్మికుంట(భారత శక్తి)** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా జమ్మికుంట పట్టణానికి చెందిన ఆకుల రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, నా నియమానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు, డాక్టర్ కే లక్ష్మణ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, నా మీద నమ్మకంతో నాకు కరీంనగర్ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్ష పదవికి సహకరించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ,పార్టీ ప్రతిష్ట కోసం అభివృద్ధి కోసం పనిచేస్తానని వారు అన్నారు.


ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ కు ఘనంగా సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, నిర్మల దేవి, హుజురాబాద్ పట్టణ ,మండల అధ్యక్షులు తూర్పాటి రాజు, పారుపల్లి కొండారెడ్డి, జమ్మికుంట పట్టణ మండల అధ్యక్షులు కొలకాని రాజు, దొంతరవిన రమేష్ యాదవ్, కమలాపూర్ మండల అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, మరియు నాయకులు భూపతి ప్రవీణ్, ఓడ్నాల విజయ్, చిదురాల శ్రీనివాస్ రెడ్డి, రాణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు..

## ఆకస్మికంగా తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే

**మంచిర్యాల :**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ ముల్కల్ల పాఠశాల లో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

. .తరగతుల గదులను పరిశీలించి ఉపాధ్యాయులతో విద్యార్థులతో మాట్లాడగా మంచినీరు సమస్య ఉందని చెప్పగానే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వెంటనే స్పందించి సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడి వెంటనే పాఠశాలలో ఉన్న మంచినీరు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారుప్రతి తరగతి గదుల్లో కూర్చులు బెంచీలు ఇతర అవసరాలు ఏమున్నా కూడ అతి తొందరగా తీరుస్తా అని ఉపాధ్యాయులకు విద్యార్థులకు హామీ ఇచ్చారు.


## శ్రీశైలాన్ని సందర్శించిన దేవదాయశాఖ మంత్రి



**(భారత శక్తి)**ఆలయాలను దర్శించే ప్రతి భక్తుడికి మెరుగైన సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి శ్రీశైలంలో భక్తుల సౌకర్యాలు, అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించిన దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిరాష్ట్రంలోని అన్ని దేవాలయాలను దర్శించుకునే భక్తులకు మరింత మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. భక్తుల సేవనే దైవసేవగా భావిస్తూ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఉదయం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదాశీర్వచనం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటాన్ని మంత్రి ఆనం కు అందజేశారు. అనంతరం భక్తుల సౌకర్యాలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. దర్శనాలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులు వేచి ఉండే ప్రదేశాల్లో అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ సమయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు భక్తులతో మంత్రి స్వయంగా మాట్లాడి దేవస్థానం అందిస్తున్న సేవలపై వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. భక్తుల అభిప్రాయాలను గౌరవించి, అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) సమీపంలో ప్రతిపాదిత వాటర్ ఏరోడ్రమ్ టెర్మినల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన మంత్రి, ఆ ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో చర్చించారు. తరువాత సున్నిపెంటలో దేవస్థానం సిబ్బందికి నిర్మించిన వసతి గృహాలను పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో మూడు నమూనాల్లో 297 గృహాలను నిర్మించడం జరిగిందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సిబ్బంది నివాసానికి అనువైన అన్ని సౌకర్యాలు కల్పించే చర్యలు చేపట్టామని చెప్పారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో వసతి గృహాల సముదాయంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, త్వరలోనే దేవస్థానం సిబ్బందిని సున్నిపెంటకు తరలించే ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు విధులకు వచ్చే సిబ్బందికి దేవస్థానం ఆధ్వర్యంలో తగిన సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే శ్రీశైలానికి చేరుకునే భక్తులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి తగిన సేవలు అందించడం, ఆలయాల అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, ప్రతి యాత్రికుడికీ సంతృప్తికరమైన దర్శనానుభూతి కల్పించడం ప్రభుత్వ సంకల్పం. భక్తుల సేవలో ఎలాంటి రాజీ ఉండదు అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## వైసీపీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి...

### - జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్



**తుగ్గలి(భారత శక్తి):** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరిగిందని వైసీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్ అన్నారు. శనివారం రోజున ఆయన మాట్లాడుతూ 50 లక్షలతో సచివాలయాలు,30 లక్షలతో రైతు భరోసా కేంద్రాలు,30 లక్షలతో హెల్త్ క్లినిక్‌లను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించి కాలనీలు ఏర్పాటు చేశామని, వైయస్ఆర్ జలకళ ద్వారా సన్నకారు రైతులకు బోర్లు వేయించి మోటార్లు పంపిణీ చేశామని చెప్పారు. అదేవిధంగా నాడు-నేడు కింద ప్రతి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. జొన్నగిరి, పగిడిరాయి,రాతన పలు గ్రామాల్లో తారు రోడ్లు,సిమెంట్ రోడ్లు వేసిన ఘనత జగన్ హయాంలోనిదే అన్నారు. ఇంతవరకు యువత,మహిళలకు ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదని ఆయన తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క మహిళకు 1500 రూపాయలు వేస్తామని వేయకుండా వెన్నుపోటు పొడిచింది టీడీపీయే అని ఆయన మండిపడ్డారు. ఎస్సీ,ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఒక్కటి అమలు చేయలేదని,గ్యాస్ సిలిండర్ల పథకం కూడా అరకొరగా చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేయకుండా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్ తెలియజేశారు.

## ఫ్లాట్ చూసేందుకు వచ్చిన 8 మందికి లిఫ్ట్ కూలి గాయాలు

హైదరాబాద్**(భారత శక్తి)** కమిషనరేట్ మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటనరంగా రెడ్డి జిల్లా: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధి హనుమాన్ నగర్‌లో లిఫ్ట్ కూలిన ఘటనలో ఎనిమిది మంది కి గాయాలు,వీరిలో ఒకరి పరిస్థితి విషమంజ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్‌లో సీఏఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరునగరి నరసింహస్వామి (62) ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు తన బంధువులతో కలిసి ఎస్టేట్ ఏజెంట్ దిలీప్ కుమార్ ద్వారా హనుమాన్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లోని 501 నంబర్ ఫ్లాట్‌ను పరిశీలించేందుకు లిఫ్ట్‌లో ఐదో అంతస్తుకు వెళ్లారు. ఫ్లాట్‌ను చూసిన అనంతరం ఎనిమిది మంది తిరిగి కిందకు వస్తుండగా, నాలుగో అంతస్తు వద్ద లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయి, వెంటనే నేరుగా గ్రౌండ్ ఫ్లోర్‌కు కూలిపోయింది. ఈ ప్రమాదంలో లిఫ్ట్‌లో ఉన్న వారందరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన వారి వివరాలు:తిరునగరి నరసింహస్వామి (62),పద్మిని (51),టి. వెంకటేశ్వర్లు (75),టి. నిర్మల (69),పి. గోపాలస్వామి (71),పి. రేణుక (65),టి. పద్మ (68),టి. శోభ (64),ఘటనపై సమాచారం అందుకున్న మీర్పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లిఫ్ట్ నిర్వహణలో లోపాలున్నాయా, సాంకేతిక సమస్య కారణంగానే ప్రమాదం జరిగిందా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సాయికృష్ణ కేసులో అధికారులకు ఉచ్చు

**విజయవాడ,(భారత శక్తి) :** సాయికృష్ణ అదృశ్యం కేసులో ఇంకా సమాధానాలు దొరకని ప్రశ్నలు చాలానే ఉన్నాయి. లాకప్‌డెత్ అని సిట్ దర్యాప్తులో తేలినప్పటికీ శవాన్ని ఎలా మాయం చేశారనే మిస్టరీ మాత్రం ఇంకా వీడలేదు. ఆ దిశగానే సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. టెక్నికల్ ఎవిడెన్స్‌తోపాటు సిబ్బంది నుంచి సమాచారాన్ని రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఆయన్ని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించేందుకు సిట్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయన ఒక్కడే శవాన్ని మాయం చేసే అవకాశం లేదని అంటున్నారు. ఆయనకు సహకరించింది ఎవరు? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. ఆయనతో సన్నిహితంగా ఉండే హెడ్‌కానిస్టేబుల్స్‌ను ప్రశ్నించాలని చూస్తున్నారు. వారు మాత్రం ప్రస్తుతానికి అజ్ఞాతంలో ఉన్నారు. సాయికృష్ణ కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు కృష్ణలం పోలీస్ స్టేషన్‌లో మే ఆరో తేదీ నుంచి మే 8 వరకు అంటే రెండు రోజుల పాటు ఏం జరిగిందనే విషయంపై ఆరా తీస్తున్నారు. మార్కాపురంలో సాయికృష్ణను అరెస్టు చేసిన పోలీసులు స్టేషన్‌కుతీసుకొచ్చిన తర్వాత ఏమయ్యాడనే దిశగానే దర్యాప్తు సాగుతోంది. లాకప్‌డెత్ అయినట్టు నిర్ధారణకు వచ్చిన దర్యాప్తు టీం, శవాన్ని ఎలా మాయం చేశారనే విషయంపై ఫోకస్ చేసింది. ఈ విషయం గురించే కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సిబ్బందిని గ్రిల్ చేస్తున్నారు. ఈ స్టేషన్‌లో మొత్తం 60 మంది పని చేస్తున్నారు. వీరిలో చాలా మందిని ఇప్పటికే ఒకిటికి రెండుసార్లు విచారించింది. వీరితోపాటు మార్కాపురం నుంచి సాయికృష్ణను తీసుకొచ్చిన టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని కూడా ప్రశ్నిస్తున్నారు. వీటితోపాటు బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వారిని కూడా విచారణకు పిలుస్తున్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బంది మొత్తాన్ని విచారించారు కానీ ఇద్దు హెడ్ కానిస్టేబుల్స్ మాత్రం ఇంత వరకు విచారణకు హాజరుకాలేదు. నాగరాజు అరెస్టు అయిన రోజు నుంచి వీరంతా అజ్ఞాతంలో ఉన్నారు. వీరిలో ఒకరు ఏడేళ్లుగా ఇదే స్టేషన్‌లో పనిచేస్తున్నారు. మరో కానిస్టేబులు ఏడాది క్రితమే ఈ స్టేషన్‌కు వచ్చారు. వీళ్లిద్దరూ నాగరాజుకు చాలా సన్నిహితంగా ఉండే వారు. ఏ పని చేయాలని అన్నా నాగరాజు వీళ్లకే ముందు చెప్పేవారు. అందుకే వీళ్లను ప్రశ్నిస్తే కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే విచారణకు రావాలని వారికి సమాచారం చేరవేశారు.ప్రస్తుతానికి ఈ ఇద్దరి ప్రమేయంపై ఎలాంటి ఆధారాలు సిట్ అధికారులకు దొరకలేదు. వీరిని సాక్షులుగానే విచారణకు పిలుస్తున్నారు. వీళ్ల ప్రమేయంపై ఆధారాలు లభిస్తే మాత్రం వీళ్లను కూడా నిందితుల జాబితాలో చేర్చే ఛాన్స్ ఉంది. ఆ ఆధారాలను కూడా సేకరించే పనిలో సిట్ టీం సీరియస్‌గా దృష్టి పెట్టింది. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న వీళ్ల ఆచూకీ కోసం అన్ని మార్గాల్లో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నాగరాజును కస్టడీలోకి తీసుకొని విచారిస్తే మరింత సమాచారం లభిస్తుందని కూడా ఆలోచిస్తున్నారు. అందుకే కస్టడీకి తీసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. 12 రోజుల పాటు ప్రశ్నించేందుకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు నాగరాజు తరఫున లాయర్లు సమయం కోరడంతో విచారణ 29కి వాయిదా పడింది. సాయికృష్ణ కేసుపై జుడీష్యియల్ విచారణ చేపట్టాలనే కొత్త వాదన కుటుంబ సభ్యుల నుంచి వచ్చింది. సిట్ దర్యాప్తుపై వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజ్ మాయమవ్వడం, ఇతర విషయాలపై వారంతా డౌట్స్ రైజ్ చేస్తున్నారు.

# 5న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

**విజయనగరం(భారత శక్తి)** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, నవ్యాంధ్రప్రదేశ్ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. జూలై 5న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, రికార్డు సమయంలో పనులను పూర్తి చేయించారు. ఈ వేడుక ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక షెడ్యూల్ ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం ప్రస్తుతం వేచి చూస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగా నేవీ రక్షణ పరిధిలో ఉండటం వల్ల అంతర్జాతీయ సర్వీసులకు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. అత్యాధునిక రన్‌వే, అంతర్జాతీయ కార్గో టెర్మినల్, ఏకకాలంలో పదుల సంఖ్యలో విమానాలు పార్క్ చేసే ఏప్రాన్ సౌకర్యాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచ దేశాల నుండి నేరుగా విశాఖకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మారబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఫార్మా హబ్‌లు, ఐటీ కారిడార్లు, ఆక్వా రంగానికి ఈ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కార్గో సేవలు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ఇక్కడి ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. దీనివల్ల వందలాది గ్లోబల్ కంపెనీలు ఉత్తరాంధ్ర వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన సిక్స్ లేన్ బీచ్ కారిడార్ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసింది.

ఈ కనెక్టివిటీ వల్ల భోగాపురం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చాయి. అలాగే రుషికొండ, భీమిలి, తొట్లకొండ తీరప్రాంతాలు గ్లోబల్ టూరిజం స్పాట్స్‌గా మారబోతున్నాయి. అంతర్జాతీయ పర్యాటకులు నేరుగా ఇక్కడికి చేరుకునే వీలుండటంతో హోటల్, హాస్పిటాలిటీ రంగాలు ఊపందుకోనున్నాయి.గతంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం వేసిన చంద్రబాబు నాయుడు, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం పనులపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. నిధుల కొరత లేకుండా చూస్తూ, నిర్మాణ సంస్థ జీఎంఆర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను పరుగులు పెట్టించారు. పౌర విమానయాన శాఖ నుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ట్రయల్ రన్స్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. జూలై 5న ఈ మెగా ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, తమ ప్రభుత్వ డెవలప్‌మెంట్ విజన్‌ను దేశవ్యాప్తంగా చాటాలని కూటమి భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తవడంతో పీఎంఓ నుంచి క్లియరెన్స్ రాగానే అధికారికంగా ప్రారంభోత్సవ తేదీని ప్రకటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఖరారైతే... అదే రోజు ఉత్తరాంధ్రలో మరికొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ సిద్ధం చేస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అనేది నవ్యాంధ్రప్రదేశ్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక మైలురాయి కాబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదని సామాన్య ప్రజల భావన.

# సింహపురిలో అనిల్ మిస్సింగ్

**నెల్లూరు,(భారత శక్తి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివాదాస్పద నేతలంతా యాక్టివయ్యారు. ఒకే ఒక్కరు తప్ప. ఆయనే మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల, జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయతతో వ్యవహరించే అనిల్ కుమార్ యాదవ్ కొద్దిరోజులుగా కనిపించడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. తాడేపల్లి సైతం దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే ఆయన రాజకీయాలకు దూరమవుతారా? లేకుంటే వైసీపీకి దూరమయ్యారా? అన్నది మాత్రం తెలియడం లేదు. కొడాలి నానితో పాటు వల్లభనేని వంశీ లాంటి వారు కూడా ఆక్టివ్ అయ్యారు కానీ.. అనిల్ జాడ లేకపోవడం నిజంగా చర్చకు దారితీస్తోంది.వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహించిన నేతల్లో అనిల్ కుమార్ యాదవ్ ఒకరు. 2009లో ఆనం బ్రదర్స్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు అనిల్ కుమార్ యాదవ్. స్వల్ప ఓట్ల తేడాతో ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టడంతో ఆ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి వైసీపీ నుంచి గెలిచిన అనిల్ ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికల్లో మాత్రం నెల్లూరు అసెంబ్లీ సీటు ఇవ్వలేదు. నరసరావుపేట పార్లమెంటు సీటును ఇచ్చారు. టిడిపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయల చేతిలో ఓడిపోయారు.

అక్కడ నుంచి కనిపించకుండా మానేశారు అనిల్ కుమార్ యాదవ్వైసీపీలో దాదాపు నేతలంతా క్రియాశీలకం అయ్యారు. అనిల్ కుమార్ యాదవ్ మాత్రం నెల్లూరులో చిన్న చిన్న ప్రెస్ మీట్ లు పెట్టి జారుకుంటున్నారు. అయితే ఇప్పటికే నెల్లూరు సిటీ బాధ్యతలను ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. ఆ నిర్ణయం నచ్చక అనిల్ కుమార్ యాదవ్ నెల్లూరు వైపు రావడం లేదన్న ప్రచారం ఉంది. మరోవైపు ఇతర రాష్ట్రాల్లో ఆయన వ్యాపారాలు చేసుకుంటున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. అనిల్ కుమార్ యాదవ్ తీరుతోనే నెల్లూరులో తనకు ఎంతో నమ్మకస్తులైన నేతలను వదులుకున్నారు జగన్. ఇప్పుడు కష్టంలో ఉండగా ఈ మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా జగన్ పక్కన నిలబడకపోవడం అనేది పొలిటికల్ వర్గాల్లో ఆశ్చర్యం వేస్తోంది. అసలు అనిల్ కుమార్ యాదవ్ తిరిగి యాక్టివ్ అవుతారా? లేదా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే జగన్మోహన్ రెడ్డి నెల్లూరు విషయంలో అనిల్ కు షరతు పెట్టడం వల్లే.. పార్టీకి దూరంగా ఉంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత నిజం ఉందో చూడాలి.

# గుంటూరు జిల్లాలో మంచికలపూడి ఆర్‌యూబీ పనులు ప్రారంభం

**గుంటూరు,(భారత శక్తి)** గుంటూరు జిల్లాలోని మంచికలపూడి ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రైల్వే గేటు కారణంగా వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమయ్యేవారు. ఈ నేపథ్యంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించి.. గురువారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆరు నెలల పాటు మంచికలపూడి గేటు మూసివేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని సూచిస్తున్నారు.గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేరనుంది. మంచికలపూడి మార్గంలో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. మంచికలపూడి మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే గేటు కారణంగా వాహనాల రద్దీ నెలకుంటోంది. రైలు వెళ్లే సమయంలో గేటు వేస్తుండటంతో రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ఒకసారి గేటు పడితే గంటపాటు ఎదురుచూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు మరో ఆరు నెలల్లో పరిష్కారం లభించనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, రైలు మార్గాలు వంటి మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పలుచోట్ల రహదారి అభివృద్ధి పనులు, విస్తరణ, మరమ్మతు పనులు చేపడుతున్నారు. అలాగే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు కూడా ముందుకు కదులుతున్నాయి. ఈ క్రమంలోనే మంచికలపూడి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనులు ఆరు నెలల పాటు కొనసాగుతాయని అధికారులు చెప్తున్నారు. దీంతో అప్పటి వరకూ గేటు మూసే ఉండనుంది. అలాగే గేటుకు కొద్దిగా ముందు రహదారికి గండికొట్టారు. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి అయ్యే వరకూ కె.ఆర్ కొండూరు, మంచికలపూడి గ్రామాలకు వెళ్లాలంటే దుగ్గిరాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.మరోవైపు కే. ఆర్. కొండూరు, దుగ్గిరాల పెట్రోల్ బంకుల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు ప్రారంభమైనట్లుగా బోర్డులు పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాంటి బోర్డులేవీ లేకపోవటంతో గేటు దాకా వెళ్లి.. పనులు జరుగుతున్న నేపథ్యంలో తిరిగి వెనక్కి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. అలా కాకుండా ముందే బోర్డుల ద్వారా సమాచారం అందిస్తే వాహనదారులకు ఉపయోగం ఉంటుందని చెప్తున్నారు.

మంచికలపూడి గేట్ తరహాలోనే చిలువూరు, దుగ్గిరాల గేట్ల విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.దుగ్గిరాల వద్ద మరో రైల్వే లైన్ ఏర్పాటు కానున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో దుగ్గిరాల, చిలువూరు గేట్ల విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అప్పుడే ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని.. ఇలా గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదని చెప్తున్నారు. మంచికలపూడి ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభం కావటంతో మరో ఆరు నెలల్లో సమస్యకు కొద్దిగా పరిష్కారం లభిస్తుందని.. దుగ్గిరాల, చిలువూరు విషయంలోనూ చర్యలు తీసుకుంటే పూర్తిస్థాయిలో ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు చెప్తున్నారు.

# జూలై మూడు నుంచి అక్షర గోవిందం

**తిరుమల,(భారత శక్తి)** చిన్నారుల తల్లిదండ్రులకు తిరుమల తిరుపతి దేవస్థానం మంచి అవకాశం కల్పిస్తోంది. శ్రీవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించుకునే సదుపాయం కల్పిస్తోంది. అక్షర గోవిందం పేరుతో జూలై మూడో తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు టీటీడీ తెలిపింది. ఆసక్తి గల తల్లిదండ్రులు వకుళామాత ఆలయానికి గంట ముందుగా చేరుకుని నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో భాగంగా టీటీడీ ఉచితంగా కిట్లు కూడా అందించనుంది.తిరుమల తిరుపతి దేవస్థానం మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. జూలై మూడో తేదీ నుంచి అక్షర గోవిందం కార్యక్రమం ప్రారంభించనుంది. చిన్నారులలో సనాతన ధర్మంపై ఆసక్తి పెంచటం, వారి విద్యాభ్యాసం శుభప్రదంగా సాగాలనే ఉద్దేశంతో అక్షర గోవిందం, అన్న ప్రాశన కార్యక్రమాలను జూలై మూడో తేదీ నుంచి టీటీడీ ప్రారంభించనుంది. తిరుపతిలోని వకుళామాత ఆలయంలో అక్షర గోవిందం , అన్నప్రాశన కార్యక్రమాలు ప్రారంభ కానున్నాయి. జూలై మూడో తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 12 గంటల 30 నిమిషాల వరకూ వకుళామాత ఆలయంలో సంప్రదాయబద్ధంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుంది. అక్షరాభ్యాసం పూర్తి అయిన తర్వాత ఆశీర్వచనం, ప్రసాదం, ప్రత్యేకంగా రూపొందించిన అక్షర గోవిందం కిట్ టీటీడీ అందిస్తుంది.అక్షర గోవిందం కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు నుంచి ఐదేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులు అర్హులు. ఇక అక్షరాభ్యాసం పూర్తయిన తర్వాత అందించే అక్షర గోవిందం కిట్‌లో టీటీడీ వివిధ వస్తువులను చేర్చింది. రాతపలక, బలపంతో పాటుగా శ్రీవారి అక్షింతలు, కంకణం, పసుపు, కుంకుమ, వకుళామాత, వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు సరస్వతీ దేవి చిత్రపటాలు ఉంటాయి. అలాగే గోవిందనామాలు, శ్రీవారి సుప్రభాతం, పెద్దబాలశిక్ష వంటివి ఉచితంగా అందిస్తారు. అక్షరాభ్యాసంతో పాటుగా వకుళామాత ఆలయంలో వేదమంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు అన్నప్రాశన కూడా నిర్వహిస్తారు.మరోవైపు అక్షర గోవిందం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరి. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు గంట ముందుగానే వకుళామాత ఆలయానికి చేరుకుని ఆలయ ప్రాంగణంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. అలాగే జూలై నాలుగో తేదీ నుంచి మంగళవారం మినహా మిగతా వారం రోజులూ వకుళామాత ఆలయంలో శుభ ముహూర్తంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.రోజుకు 50 మంది చిన్నారులకు... బ్యాచ్‌కు 25 మంది చొప్పున రెండు బ్యాచులలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అలాగే అక్షర గోవిందం కార్యక్రమానికి హాజరయ్యే చిన్నారులు తల్లిదండ్రులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది

# లాభలో బాటలో అవకడో రైతులు

**కడప(భారత శక్తి)** రాయలసీమ రైతులు రూటు మార్చారు.. సంప్రదాయ పంటల్ని పక్కన పెట్టారు. సరికొత్త ప్రయోగాలతో భారీగా లాభాలు అందుకుంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన రైతు ఆపిల్ సాగు చేసి సక్సెస్ అందుకుంటే.. కడప జిల్లాకు చెందిన యువ రైతు అవకాడో సాగు చేసి ఆదాయం పొందారు. సేంద్రీయ ఎరువులు, బిందు సేద్యంతో విజయం సాధించారు. ఎరాకు ఏకంగా రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది.రాయలసీమలో రైతులు వ్యవసాయంలో వినూత్న ప్రయోగాలతో అద్భుతాలు చేస్తున్నారు. కరువు ప్రాంతంగా పిలిచే ప్రాంతాల్లోనూ అధిక దిగుబడిని సాధిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తు?న్నారు. సీమ జిల్లాల్లో కంది, శనగ, ఉలవలు, పెసర్లు, వేరుశెనగ వంటి వాటితో పాటుగా గులాబీ, చామంతి, మల్లెలు కూడా సాగు చేస్తున్నారు. ఉద్యానవన పంటలైన అరటి, బత్తాయి, బొప్పాయి, దానిమ్మ, మామిడిని సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఉద్యానవన పంటల్లోనూ వినూత్నంగా ఆపిల్ సాగు చేసి సక్సెస్ అయ్యారు. తాజాగా మరో రైతు సరికొత్తగా అవకాడో సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు.సాధారణంగా అవకాడో వేడి తక్కువగా ఉండే చోట మాత్రమే సాగు చేస్తుంటారు. రాయలసీమ వంటి ప్రాంతంలో వేడి వాతావరణం ఎక్కువగా ఉంటుంది. అయినా సరే అవకాడో సాగు మొదలైంది. కడప జిల్లా లింగాల మండలం వెలిదండ్లకు యువ రైతు కర్ణవరదారెడ్డి అవకాడో సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. వేడి వాతావరణం ఉంటుందని తెలిసినా సరే వెనకడుగు వేయలేదు.. ధైర్యంగా అవకాడోను సాగు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితమే ప్లాన్ చేసి.. కర్ణాటకలోని కూర్గ్ దగ్గర అంటుకట్టి మొక్కల్ని తెప్పించారు..రైతు కర్ణవరదారెడ్డి తనకున్న రెండెకరాల పొలంలో ఎకరాకు 110 మొక్కల చొప్పున అవకాడో మొక్కల్ని నాటారు. నీటి కొరత లేకుండా బిందు సేద్యం చేశారు.

అంతేకాదు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువుల్ని ఉపయోగించారు. పంటకు ఎలాంటి తెగుళ్లు రాకుండా జాగ్రత్తగా నాలుగేళ్ల పాటూ చూసుకున్నారు. రైతు ఆదివారం రోజు కాయల్ని తొలిసారి కోశారు. ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి వచ్చిందని.. మరో ఐదు టన్నుల పంట కోయాల్సి ఉందని రైతు చెబుతున్నారు. కేజీ రూ.100 చొప్పున విక్రయించారు.. వ్యాపారులు నేరుగా కర్ణవరదారెడ్డి తోట దగ్గరకు వచ్చి కొనుగోలు చేయడం విశేషం. రైతు ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం పొందారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నా సరే రైతు మాత్రం వెనకడుగు వేయలేదు.. ధైర్యం చేసి అవకాడో సాగు చేసి లాభాలు అందుకున్నారు.ఇటీవల కడప జిల్లాకు చెందిన మరో రైతు బత్తాయి పంట సాగు చేసి రూ.కోటికిపైగా ఆదాయం పొందారు. అలాగే అనంతపురం జిల్లాలో ఆపిల్ సాగు చేసి మరో రైతు సక్సెస్ అయ్యారు.. ఆయనకు మంచి దిగుబడి వచ్చింది. రాయలసీమలో పరిస్థితులు మెల్లిగా మారిపోతున్నాయి. సరికొత్త ప్రయోగాలతో రైతులు సక్సెస్ అవుతున్నారు. ఈ రైతుల్ని ఆదర్శంగా తీసుకుని మరికొందరు కూడా సరికొత్త ఉద్యానవన పంటల్ని సాగు చేసే పనిలో ఉన్నారు. అలాగే బిందు సేద్యం, సేంద్రీయ ఎరువులతో పంటల్ని సాగు చేస్తున్నారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

**మేడ్చల్ (భారత శక్తి)**గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న మేడ్చల్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై మేడ్చల్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ అలియాస్ నితిన్ అలియాస్ ఆకాష్ (24), రాజేష్ మాధవ్ చౌదరి (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధ్రువ కళాశాల రోడ్డు, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.06 సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి మేడ్చల్‌లో అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపరచగా, గంజాయి సరఫరా మూలాలు మరియు ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్‌కు సంబంధించిన ఇతర వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విధేయత ... అనిశ్చితా...

**విజయవాడ,(భారత శక్తి)** వైసీపీలో మాత్రం జగన్ మాటకు ఎదురుండదు. ఆయన దృష్టిలో పడితే మంత్రి పదవి గ్యారంటీ. అందుకే వైసీపీ నేతలు యాక్టివ్ గా ఉంటారు. మిగిలిన పార్టీలలోఅలా ఉండదు. ఎవరికి చివరి నిమిషంలో మంత్రి పదవి దక్కుతుందన్నది ఎవరికీ తెలియదు. కానీ జగన్ విషయంలో అలా కాదు. తాను డిసైడ్ అయితే ఇక జగన్ ను ఇన్ ఫ్యుయెన్స్ చేసే మరొకరు పార్టీలో లేకపోవడంతో ఎక్కువ మంది నేతలు జగన్ దృష్టిలో పడతారు. అందుకే పదకొండు సీట్లకు పరిమితమయినా వైసీపీ మంచి ఊపు మీద ఉండటానికి ఇదే కారణం. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తమకు ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అలాగని అంబటి రాంబాబు, పేర్ని నానిలు కేవలం పదవుల కోసమే చేసే వారు మాత్రం కాదు. జగన్ అంటే వారికి పిచ్చ అభిమానం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఇద్దరూ కాంగ్రెస్ లోనే ఉన్నారు. తర్వాత జగన్ పార్టీలో చేరారు. పార్టీ ఓడినా, గెలిచినా వీరు మాత్రం జగన్ మాట జవదాటరు. పార్టీని వదిలి వెళ్లాలన్న ఆలోచన చేయరు. జగన్ కోసం వీళు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి మాత్రం ఎఫెన్స్ గానే ఉన్నారు. ఎన్ని కేసులు నమోదయినా వెనక్కుతగ్గరన్న పేరుంది. జగన్ పట్ల విధేయతగా ఉండటంతో పాటు జగన్ పై ఎవరు విమర్శించినా వెంటనే మీడియా ముందుకు వచ్చి నాలుగు దులిపి వెళతారు. ఇద్దరూ కాపు సామాజికవర్గం నేతలయినప్పటికీ ఏనాడూ జగన్ పార్టీ నుంచి బయటకు వెళ్లాలన్న ఆలోచన కూడా చేయరు. అంతేకాదు తమ సొంత సామాజివకర్గమే అయినా పవన్ కల్యాణ్ పై విమర్శలకు వెనుకాడరు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయాల్లో ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి. ఆయన తన నాయకులకు, ప్రతినిధులకు ఇచ్చే బాధ్యత చాలా క్లియర్ గా ఉంటుంది. ఎవరు ఏం మాట్లాడాలి, ఏం చేయాలి అన్న దానిపై సందిగ్ధత ఉండదు. జగన్ కోసమే నిలబడటమే తెలుసు తప్ప.. సొంత సామాజికవర్గం దూరమవుతుందన్న ఆలోచన కూడా చేయరు. అయితే వీళ్లిద్దరూ వైసీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవులు తమకు వస్తాయని ఆశించి మాత్రం విమర్శలు చేయరు. వీళ్లిద్దరూ జగన్ కు అత్యంత నమ్మకమైన నేతలు. జగన్ పై ఈగవాలినా ఊరుకునే రకం కాదు. అందుకే వైసీపీలో వీరిద్దరికీ ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

**పార్టీకి గుడ్ బై కొట్టనున్న ఆ ముగ్గురు** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి చాలామంది ఎమ్మెల్యేలు తెలుగుదేశం కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ జాబితాలో ఓ ముగ్గురు ఇప్పుడు తాజాగా చేరారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీకి టచ్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నారా లోకేష్ తో మాట్లాడినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా చర్చకు దారితీస్తోంది. అసలు టిడిపికి టచ్ లోకి ఎవరు వచ్చారు. టిడిపి వారిని తీసుకుంటుందా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ ఏదో జరుగుతోందన్న అనుమానాలు మాత్రం బలపడుతున్నాయి. ఒకరిద్దరూ టిడిపి ఎమ్మెల్యేల విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. స్థానిక పరిస్థితుల దృష్ట్యా వారు లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. అటువంటి వివాదాస్పద ఎమ్మెల్యేలకు వైసీపీ టచ్ లోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వారు వైసీపీలోకి వెళ్లిన మరుక్షణం.. వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలను లాగేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో రాయలసీమ నుంచి ఏడుగురు ఉన్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఓ ఇద్దరు గెలిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మరో ఇద్దరు ఉన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, బాల నాగిరెడ్డి, టి చంద్రశేఖర్, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ దాసరి సుధా, విశ్వేశ్వర రాజు, మత్స్యలింగం, అమర్నాథ్ రెడ్డి, విరూపాక్ష తదితరులు ఉన్నారు. అయితే ఇందులో రిజర్వుడు నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు అధికం. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో అసెంబ్లీకి హాజరు కావడం లేదు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇందులో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు ఈ నిర్ణయంతో విభేదిస్తున్నారు. వారంతా అసెంబ్లీకి వెళ్లాలని ఎక్కువగా కోరుకుంటున్నారు. కానీ ఆ కోరిక తీరడం లేదు.మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితులు కనిపించడం లేదు. కూటమి దూకుడుగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారం అందుతుంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉండడం కంటే కూటమిలో చేరడం ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చిన వారు ఉన్నారు. ప్రధానంగా ఓ ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు కూటమితో పాటు మంత్రి నారా లోకేష్ కు టచ్ లోకి వెళ్లినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. టిడిపిలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఎమ్మెల్యే పార్టీపై అసంతృప్తిగా ఉన్నారు. వైసిపి కి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఓ నేత సైతం అక్కడి ఎంపీ తో తీవ్రంగా విభేదిస్తున్నారు. ఆయన సైతం వైసీపీకి దగ్గరవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఆ ఎమ్మెల్యేలు కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలు.. కూటమి వైపు రావడం ఖాయం అన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే ఒక సంచలనమే.

# ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల బాట..

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలపై ఈ విద్యా సంవత్సరంలో తల్లిదండ్రుల విశ్వాసం గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లడం సాధారణంగా కనిపించేది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా మారింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం విద్యారంగంలో కొత్త మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం లక్షకు పైగా విద్యార్థులు ప్రభుత్వ బడులను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.ఈ చేరికల పెరుగుదలకు ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రధాన కారణంగా నిలిచాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా 'బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వల్ల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన గురించి ప్రజలకు వివరించడం కూడా సానుకూల ఫలితాలను ఇచ్చిందని చెబుతున్నారు.అంతేకాకుండా 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించడం ద్వారా తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేశారు. పిల్లల చదువు, పాఠశాల నిర్వహణ, అవసరమైన వసతులపై నేరుగా అభిప్రాయాలు తెలుసుకోవడం వల్ల పరస్పర నమ్మకం పెరిగింది. ఈ విధానం ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మంచి అభిప్రాయాన్ని తీసుకువచ్చిందని అధికారులు భావిస్తున్నారు.ఇక ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులు కూడా చాలా కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దీంతో నాణ్యమైన విద్యతో పాటు తక్కువ ఆర్థిక భారం ఉండే ప్రభుత్వ పాఠశాలలను చాలా మంది తల్లిదండ్రులు ఎంచుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, పరీక్షల్లో మంచి ఫలితాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు కూడా ఈ మార్పుకు కారణమయ్యాయి.ప్రభుత్వం ఉపాధ్యాయులను ప్రోత్సహించే చర్యలు కూడా తీసుకుంది. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల ఉపాధ్యాయుల్లో ఉత్సాహం పెరిగిందని విద్యావర్గాలు చెబుతున్నాయి. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.పాఠశాలల అభివృద్ధి కోసం మరో కీలక నిర్ణయంగా 159 ప్రభుత్వ పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. మెరుగైన తరగతి గదులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక బోధనా పద్ధతులతో వీటిని తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.అదే విధంగా లీప్ పాఠశాలల్లో 9వ, 10వ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ విషయాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. తొలి దశలో 175 పాఠశాలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యార్థులు క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోంది. నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత వినియోగం, ఉపాధ్యాయుల కృషి కలిసి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దారి తీస్తున్నాయని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# జ్యువెలరీ షోరూమ్‌లో రౌడీల వీరంగం

**హైదరాబాద్(భారత శక్తి)** బంజారాహిల్స్ జ్యువెలరీ షోరూమ్లో రౌడీ షీటర్ వీరంగనీ సృష్టించాడు. బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసాడు. పోలీసులు అలీమ్, యూనస్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసారు.

రోడ్ నం.10లోని శ్రీ సాయి జగదాంబ పెరల్స్ అండ్ జ్యువెలర్స్ షోరూమ్లో ఘటన జరిగింది. మద్యం మత్తులో వచ్చి మేనేజర్ను బెదిరించారని ఫిర్యాదు. మేనేజర్ ను కత్తితో బెదిరించి లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. నెక్స్ట్ టైమ్ వచ్చినప్పుడు డబ్బు రెడీ గా ఉంచాలని బెదిరింపులకు గురిచేసారు.

తనకు, సిబ్బందికి ప్రాణహాని ఉందని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని మేనేజర్ పంకజ్ బండ్గర్ ఫిర్యాదు చేసాడు. మేనేజర్ ఫిర్యాదుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు. అలీమ్, యూనస్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# రైతుల పక్షపాతికి

## భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా

**- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**



**పెద్దపల్లి(భారత శక్తి)** రైతుల పక్షపాతిగా చెప్పుకునే ఎమ్మెల్యే విజయ రమణ రావుకు భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా అంటూ బీ ఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మండలంని పెద్దకల్వల గ్రామం వద్ద ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను రైతులు అడ్డుకోవడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. అధికారులు రైతులను సంప్రదించకుండా,ఏకపక్షంగా వ్యవసాయ భూముల్లో మార్కింగ్‌లు వేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. ఆందోళన చేస్తున్న భూ నిర్వాసిత రైతులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. గతంలో గ్రామ ప్రజాప్రతినిధికి చెందిన స్థలానికి సమీపంగా బైపాస్ రోడ్డు ఉండాలని నిర్ణయించిన ప్పటికీ,తాజాగా ప్రణాళికను మార్చి, చిన్న, సన్నకారు రైతుల సారవంత మైన వ్యవసాయ భూముల మీదుగా రోడ్డును మళ్లించడం వెనుక పెద్ద కుట్ర ఉందని దాసరి ఉష ఆరోపించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, హడావుడిగా ఎర్రజెండాలు పాతడం వెనుక అధికార పార్టీ నేతల స్వార్థం దాగి ఉందని ఆమె మండిప డ్డారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి,వారి భూములను లాక్కోవాలని చూడటం దుర్మార్గమని,ఒక రైతుకు మూడు ఎకరాల వరకు భూమి పోయే పరిస్థితి ఉంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని, దాదాపు 15 ఎకరాల సారవంతమైన భూమి ఈ సర్వే వల్ల నాశనమవుతోంది. కొందరు బడా వ్యక్తుల అక్రమ కట్టడాలను కాపాడటం కోసమే పేద రైతుల భూములను బలి ఇస్తారా అంటూ ప్రశ్నించారు. భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా,రైతుల అనుమతి లేకుండా చేసే సర్వేలను వెంటనే నిలిపివే యాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి, భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యను పట్టించు కోకుండా,బలవంతంగా భూసేకరణకు ప్రయత్నిస్తే రైతుల సమస్య పరిష్కారమ య్యే వరకు వారి పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని, అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె స్పష్టం చేశారు.

## కుల రాజకీయాలకు పాల్పడుతున్న

# వైఎస్సార్‌సీపీ నాయకులు

**అనకాపల్లి(భారత శక్తి)** ఎలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, విజయవాడలో సాయి అనే యువకుడి ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా పేర్ని నాని, అంబటి రాంబాబు తమ పార్టీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై మీడియా సమావేశాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని, గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేసినా వారికి ఇంకా గుణపాఠం కాలేదని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైఎస్సార్‌సీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఎలమంచిలి నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గం కూడా పేర్ని నాని, అంబటి రాంబాబు వ్యాఖ్యలను పట్టించుకునే పరిస్థితుల్లో లేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల విశ్వాసంతో ప్రభుత్వం మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు... ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదిరులు పాల్గొన్నారు...

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

**- సర్పంచ్ మామిడాల లలిత రాజేశం**

**- రాజీవ్‌నగర్ గ్రామంలో ఇంటింటి సర్ ఓటరు సర్వేప్రజాక్రాంతి;**

**తాండూర్ (భారత శక్తి)** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజీవ్‌నగర్ గ్రామంలో ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడాల లలిత రాజేశం మాట్లాడుతూ,ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలి.



ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమానికి సహకరించాలి, సరైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలి అని అన్నారు.అనంతరం బిఎల్ఓ ఎన్. రజిత, బిఎల్ఏ సీహెచ్. నరేష్, ఉప సర్పంచ్ కావట్టి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## పారిశుద్ధ్య కార్మికురాలిపై మహిళ దాడి

**అల్వాల్ (భారత శక్తి)** చెత్తను రోడ్డుపై వేయకుండా అడ్డుకున్న పారిశుద్ధ్య కార్మికురాలిపై ఓ మహిళ దురుసుగా ప్రవర్తించి, దాడికి యత్నించిన ఘటన అల్వాల్ కాలనీ సర్కిల్ పరిధిలోని దీనదయాళ్ నాలా ప్రాంతంలో చోటుచేసుకుంది.స్థానికంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై చెత్త వేయడానికి ప్రయత్నించిన మహిళను అడ్డుకున్నారు.

దీంతో ఆగ్రహానికి గురైన ఆమె పారిశుద్ధ్య కార్మికురాలితో అసభ్య పదజాలంతో దూషిస్తూ, చేయి చేసుకునేందుకు యత్నించినట్లు సిబ్బంది తెలిపారు. పారిశుద్ధ్య నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికురాలిని దూషించడం, దాడికి యత్నించడం వంటి అంశాలపై అల్వాల్ కాలనీ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నట్లు అధికారులు వెల్లడించారు.ప్రజలు పారిశుద్ధ్య నిబంధనలను పాటించి, విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం

# అక్రమాలపై 11 మందిపై కేసు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి (భారత శక్తి):** మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాల వ్యవహారా న్ని జిల్లా యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణి స్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు, పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా ప్రాథమి క వ్యవసాయ సహకార సంఘం అధికారులు మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 11 మందిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణ లో ట్యాబ్ ఆపరేటర్ నకిలీ ట్రక్ చిట్లు సృష్టించడం, కొను గోలు రికార్డుల్లో అక్రమ నమోదులు చేయడం, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించడం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ప్రమేయంతో కుట్రపూరితంగా వ్యవహరించినట్లు గుర్తించిన ట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు, దర్యాప్తులో మరెవరి ప్రమేయం వెలుగులోకి వచ్చినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో మూడు లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాలు, సుమారు 885.20 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాలు 2,168.40 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు. రైతుల శ్రమను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత ను పాటించేలా అన్ని కొనుగో లు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యల తో పాటు శాఖాపరమై న చర్యలు కూడా తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.

## కుర్మవాడలో రూ.21.50 లక్షల సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ (భారత శక్తి)** కరీంనగర్ నగరపాలక సంస్థ 48వ డివిజన్ కుర్మవాడలో రూ.21.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నగరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ-అనిల్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి-ప్రకాష్, 47వ డివిజన్ కార్పొరేటర్ గాజ రామ-శివరాం, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు.

- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.- రెండు చోట్ల ఓటు ఉండటం నేరం..**
- **సర్ ప్రక్రియకు ప్రతి ఓటరు సహకరించాలి.**
- **రాజకీయ స్వార్థం కోసం ఇతర ప్రాంతాల ఓటర్ల నమోదు ప్రజాస్వామ్యానికి విఘాతం.**

**(భారత శక్తి)** డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఆయన స్వగృహానికి శనివారం నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన బీఎల్‌ఓ బుచ్చమ్మ, నోముల వెంకటదాస్, సూపర్వైజర్ ఎన్. పద్మ, బీఎల్‌ఏ శ్రీశైలం తదితరులు వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా అధికారులు వారిని కలిసి మాట్లాడారు.ఆ తర్వాత షాద్ నగర్ నియోజకవర్గంలో బతితీ సర్వే ఎలా జరుగుతుందో స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఒకే ఓటు మాత్రమే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు చోట్ల ఓట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నిబంధనల ప్రకారమేనని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తన ఓటుకు తానే బాధ్యుడని, అనవసరంగా ఒక ఊరిలో ఒక ఓటు, తాను నివసించే మరో ప్రాంతంలో ఇంకో ఓటు నమోదు చేసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉపాధి, జీవనోపాధి కోసం బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది వలస వచ్చి పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తూ జీవిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి వారు తమ స్వస్థలంలో ఒక ఓటు, ఇక్కడ మరో ఓటు కలిగి ఉండటం పూర్తిగా నేరమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి ఓటరు తన ఓటును సరైన ప్రాంతంలో నమోదు చేసుకునేలా అధికారులకు సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎవరైనా తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఉరవకొండలో ఘర్షణ.. పదిమందికి గాయాలు

**అనంతపురం (భారత శక్తి)** ఉరవకొండ తలారి వీధిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. పాత కక్షల నేపథ్యంలో పరస్పరం కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఘటనలో నలుగురు మహిళలతో సహా 10 మందికి గాయాలు అయ్యాయి. వారికి ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కొట్టుకునే వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సెంటిమెంట్ విఫల వ్యూహం..

**- జనం లైట్ తీసుకుంటున్నారా?**

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ రాజకీయ చిత్రపటంపై సరికొత్త వ్యూహాలు, సమీకరణాలు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ ప్రాంతీయవాదాన్ని పవన్ అవమానించారంటూ ఆయనపై దేశద్రోహం కేసులు పెట్టాలనే డిమాండ్ల వరకు కవిత వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ప్రస్తుతం తన రాజకీయ అస్తిత్వాన్ని, కొత్త పార్టీ ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చడం ద్వారా ప్రజాదరణ పొందవచ్చని ఆమె భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పొరుగు రాష్ట్ర నేత అయిన పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో, ఢిల్లీ లో చేసిన కొన్ని వ్యాఖ్యలను ఆమె తనకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. తెలంగాణవాదులను, ప్రాంతీయ అస్తిత్వాన్ని పవన్ కించపరిచారనే భావనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకోవాలనేది ఆమె అసలు స్కెచ్ .రాజకీయాల్లో ఒక పాపులర్ స్ట్రాటజీ ఉంది.. పెద్ద ఇమేజ్ ఉన్న నాయకుడిని లేదా సెలబ్రిటీని టార్గెట్ చేయడం ద్వారా చాలా తక్కువ సమయంలోనే వార్తల్లో నిలవవచ్చు. కవిత ప్రస్తుతం సరిగ్గా ఇదే ఫార్ములాను వాడుతున్నట్లు కనిపిస్తోంది. నిజానికి ఆమె ప్రధానంగా ఫైట్ చేయాల్సింది అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో లేదా తన పాత ఓటు బ్యాంక్ కలిగిన బీఆర్ఎస్‌తో. కానీ వారిని వదిలి, ఏపీలో తిరుగులేని పవర్‌తో దూసుకుపోతున్న పవన్ కళ్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా.. ఏమి సాధిస్తారన్నది ప్రశ్న. కవిత ఎంతగా విమర్శలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న అసలు వాస్తవం ఏమిటంటే తెలంగాణలో జనసేన రాజకీయ ప్రభావం దాదాపు శూన్యం. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సక్సెస్ తర్వాత హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన సరికొత్త ఆఫీసును ప్రారంభించినప్పటికీ, అది ఇంకా ఇక్కడ పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా ఎదగలేదు. అంతగా ప్రభావం లేని పార్టీ అధినేతను ఉద్దేశించి రోజూ ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల, కవిత తన స్థాయిని తగ్గించుకోవడమే కాకుండా.. అనవసరంగా జనసేనకు ఇక్కడ మైలేజ్ ఇస్తున్నారనే టాక్ వినిపిస్తోందిపవన్ కళ్యాణ్ ఏదో అన్నారని, దాని చుట్టూ దేశద్రోహం కేసుల వరకు వెళ్లడం క్షేత్రస్థాయిలో ప్రజలను పెద్దగా ఆకట్టుకోవడం లేదు. తెలంగాణ సమాజం ప్రస్తుతం నిరుద్యోగం, రైతుల రుణమాఫీ, స్థానిక సమస్యలు, కాంగ్రెస్ పాలన వంటి అంశాలపై చర్చించుకుంటోంది. అంతే తప్ప ఏపీ నేత తెలంగాణ గురించి ఏం మాట్లాడారనే అంశంపై సామాన్యులకు పెద్దగా ఆసక్తి లేదు. ఫలితంగా కవిత చేస్తున్న ఈ విమర్శలు సోషల్ మీడియాలో ట్రోల్స్, కౌంటర్ అటాక్స్‌కు పరిమితం అవుతున్నాయి తప్ప.. ఓటర్ల మధ్య ఒక సీరియస్ చర్చకు దారితీయడం లేదు.ఒక కొత్త ప్రాంతీయ పార్టీగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్లాలంటే కేవలం డైవర్షన్ పాలిటిక్స్ లేదా పొరుగు రాష్ట్ర నేతలపై విమర్శలు సరిపోవని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలోని గూడాలలో, పల్లెల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై లేదా స్థానిక సమస్యలపై పోరాడితేనే కవితకు మైలేజ్ వస్తుంది. లేదంటే పవన్‌ను టార్గెట్ చేసే ఈ వ్యూహం కేవలం డిబేట్లకే పరిమితమై, రాజకీయంగా ఆమెకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చకపోవచ్చు.

# రైతులకు ధాన్యం నగదు ఎప్పుడు

**మహబూబ్ నగర్,(భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన భాగంగా, రైతులకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంతో ఒక ప్రక్క ఐకెపి కేంద్రాలు, మరొక పక్క సొసైటీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో డబ్బులు అందించి రైతులకు లబ్ధి చేకూరాలని లక్ష్యంతో కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశారు. ధాన్యం రైతు కొనుగోలు కేంద్రాల్లో పోసిన నాటి నుండి నేటి వరకు అనేక విధాలుగా కష్టపడి కాంటాలు పెట్టి, లారీలలో లోడ్ చేసి, మిల్లులో దిగుమతి చేశారు. నెల లు గడిచిన ధాన్యం నగదు రాకపోవడంతో రైతులు అనేక బాధలు పడుతున్నారు.మండలం లో మొత్తం 17 ఐకెపి కేంద్రాలు, 11 సహకార సొసైటీల ద్వారా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం అమ్మకాలు చేశారు. దీనిలో 17 ఐకెపి కేంద్రాల ద్వారా 2,60,780 క్వింటాల ధాన్యా న్ని సుమారు 3785 మంది రైతుల ద్వారా మిల్లులలో కొనుగోలు చేశారు. తుంగతుర్తి రైతు సేవ సహకార సొసైటీ 11 సెంటర్ల ద్వారా సుమారు, 3000 మంది రైతుల గాను, 500 రైతుల పైచిలుకు ధాన్యం బిల్లుల కోసం మిల్లుల చుట్టూ తిరుగుతున్నామని, సొసైటీ అధికారి పేర్కొన్నారు.ఐకెపి సెంటర్ల ద్వారా ప్రస్తుతం 3000 మందికి రైతులకు ధాన్యం అమ్మకాలపై డబ్బులు అందించినట్లు ఐకెపి ఎపిఎం యాదమ్మ తెలిపారు. 785 మంది రైతులకు, నెల రోజులు గడిచినప్పటికీ, నేటికి నగదు అందలేదని, అకౌంట్లో బిల్లులు పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం సీజన్ స్టార్ట్ అయినప్పటికీ, ఒక ప్రక్క విత్తనాలు మరొక ప్రక్క యూరియా, డిఏపి అవసరాలు ఉండగా, సమయానికి ప్రభుత్వం డబ్బులు పంపిణీ చేయలేదని, మాకు అప్పు కూడా పుడుతలేదని వివిధ గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి, సంబంధిత ఐకెపి సొసైటీ యాజమాన్యాలతో మాట్లాడి బిల్లులు వేగవంతంగా చేసి డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, మేధావులు, వివిధ పార్టీ నాయకులు కోరుతున్నారు.రైతు సేవ సహకార సొసైటీ ద్వారా సెంటర్ లో ధాన్యం పోసి అమ్మకం చేసి, రెండు నెలలు గడుస్తున్న నేటి వరకు కూడా నాకు డబ్బులు రాలేదు.

దీనితో విత్తనాలు ,యూరియా కొనాలంటే ఇబ్బందికరంగా ఉంది. తక్షణమే అధికారులు స్పందించి, ధాన్యం బిల్లు వచ్చే విధంగా చూడాలి.ప్రస్తుతం ఈ సీజన్లో 2,60,000 785 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాము. సుమారు 3785 మంది రైతులకు గాను 3000 రైతులకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఇంకా సుమారు 785 మంది రైతులకు నగదు రావాల్సి ఉంది. ఈ చెల్లింపులకు అవసరమైన అన్ని పనులను సిబ్బందితో ఆన్ లైన్ లో ఇప్పటికే పూర్తి చేయించాం. నగదును తొందరగా ఇప్పించేందుకు కృషి చేస్తున్నాము.

## వానా కాల్ వచ్చేస్తోంది... వంటా వార్పు ఎలా

**నల్గొండ,(భారత శక్తి)** ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.స్మార్ట్ క్లాస్‌రూమ్స్ గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో, ఇంకా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల మధ్యాహ్న భోజనం చెట్ల కిందే వండుతున్నారు. వర్షం వస్తే వంట ఆగిపోతుంది.. పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.చాలాచోట్ల నీటి వసతి లేని చోట వ్యవసాయ బావుల నుండి, సమీపంలోని ఇండ్ల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు వంటకి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ వర్షాకాలంలో తాము వంట చేయడానికి తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన వంట చెరుకు నిల్వ చేయడం, సామాగ్రి నిలువ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసే జులై, ఆగస్టు నెలలో వంట చేయడం తమకు పెద్ద తంటగా మారిందని వాపోతున్నారు.ఇక అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న హైస్కూళ్ళు, కొన్ని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి అనువైన వసతి లేక తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణ చెట్ల కింద భోజనం చేస్తున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో డైనింగ్ హాళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా చాలా చోట్ల పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.ఇక ఇదే తరహాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల నిర్మించలేదు. దీనితో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత పద్ధతిలో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మించి, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.కేసముద్రం మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో వంట సిబ్బంది చెట్ల కింద వంట చేయాల్సి వస్తుండగా, విద్యార్థులు తరగతి గదుల్లో లేదా ఆవరణలో భోజనం చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

**యదాద్రి(భారత శక్తి)** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఇంజినీర్లు, ఉద్యోగులు ఆందోళనకు దిగారు. యాష్ హ్యాండ్లింగ్, బొగ్గు హ్యాండ్లింగ్ ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు. జూన్ 29 టెండర్ల గడువుకు ముందే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరిక ఇచ్చారు. ప్రైవేటీకరణ ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. విద్యుత్ రంగం మొత్తం ప్రైవేటీకరణకు ఇదే తొలి అడుగు అని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 10కి చేరిన కోడిగుడ్డు



**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణలో సామాన్యుడి వంటగది బడ్జెట్‌పై అదనపు భారం పడింది. గత మూడు నెలలుగా నిరంతరంగా పెరుగుతున్న కోడిగుడ్డు ధరలు ప్రస్తుతం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర రూ.8 పలుకుతుండగా, సమీప భవిష్యత్తులో ఇది రూ.10కి చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం అమలుపైనా తీవ్ర ప్రభావం చూపుతోందినేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో జూన్ 20-26 మధ్య హోల్‌సేల్ ధర రూ.6.35గా నమోదైంది. ఈ నెల ప్రారంభంలో రూ.5.55గా ఉన్న ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఫలితంగా రిటైల్ వ్యాపారులు ప్రాంతాన్ని బట్టి రూ.6.80 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వేసవి తీవ్రతకు రాష్ట్రంలోని పౌల్ట్రీ ఫారాల్లో సుమారు 10 శాతం మేర కోళ్లు మృతి చెందడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు కోళ్ల దాణా, మందుల ఖర్చులు పెరగడం కూడా సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపింది.ప్రస్తుతం ఒక్కో గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.7 వరకు ఖర్చవుతుండగా, ఫాం గేట్ వద్ద మాత్రం రూ.6 మాత్రమే లభిస్తోందని జాతీయ ఉత్తర తెలంగాణ గుడ్ల సమన్వయ కమిటీ ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. గతంలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఎదురైన నష్టాలను ప్రస్తుత ధరల పెరుగుదల కొంతమేర భర్తీ చేస్తోందని ఆయన వివరించారు.మరోవైపు, తాము రూ.6.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా తదితర ఖర్చులు పోను నామమాత్రపు లాభంతో రూ.7కి అమ్ముతున్నామని చిల్లర వర్తకులు చెబుతున్నారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 4 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా, అందులో సగం స్థానికంగా వినియోగమవుతున్నాయి. ప్రస్తుత ధరల పెరుగుదల ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథక సరఫరాదారులపై కూడా తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. వర్షాకాలం ప్రారంభమైతే పరిస్థితులు మెరుగుపడి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో డిమాండ్ కూడా అధికమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ధరలు స్థిరంగా కొనసాగవచ్చు లేదా మరింత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రెండు కార్లు ఒకదానిని మరొకటి ఢీ

### - ముగ్గురు మృతి, మరో ముగ్గురికి గాయాలు

**కడప(భారత శక్తి)** కడప రింగ్ రోడ్డు లోని పాలెంపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. మృతులు తిరుపతి పట్టణం జీవకోనకు చెందిన హర్షవర్ధన్(27) కిషోర్(28) సుధీర్ కుమార్ రెడ్డి(24 )గా గుర్తించారదు. తిరుపతి నుండి హైదరాబాదుకు వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందగా ఎర్టిగా కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెన్నూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు.

## గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

**విజయవాడ(భారత శక్తి)** కృష్ణలంక పోలీసు స్టేషన్ లో మృతి చెందిన గాదె సాయి కృష్ణ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. సిట్ అధికారులు × పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు, సీఐ నాగరాజు సన్నిహితుడు సురేష్ ఆచూకీ కోసం హైదరాబాద్, బెంగళూరులో స్పెషల్ టీమ్స్ గాలిస్తున్నాయి. ఇప్పటికే అశోక్, నాని సిట్ ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చింది. సాయికృష్ణ అదృశ్యంలో కీలక సమాచారం ఈ ముగ్గురికి తెలుసని సిట్ అధికారులు భావిస్తున్నారు.

## సత్యదేవుని సేవలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని




**అన్నవరం(భారత శక్తి)** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారిని శనివారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యేకి ఆలయ అధికారులు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు అనంతరం ఆలయ మండపంలో అర్చకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి స్వామి వారి శేష వస్త్రాన్ని అందించి వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు..

## రాయిదుర్గంలో ల్యాప్ టాప్ చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగ అరెస్ట్

**(భారత శక్తి)**ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఓ యువకుడిని వరుస దొంగతనాల బాట పట్టించింది. అప్పులు తీర్చుకునేందుకు ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించి విలువైన ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ల్యాప్‌టాప్ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. చిత్తూరు జిల్లా రొంపిచర్లకు చెందిన 23 ఏళ్ల నాగిశెట్టి జశ్వంత్‌ను అరెస్టు చేశారు. మాజీ అమెజాన్ ఉద్యోగిగా పనిచేసిన జశ్వంత్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఉండటంతో సుమారు రెండు లక్షల రూపాయల అప్పులు అయినట్లు విచారణలో వెల్లడైంది.ఆ అప్పులు తీర్చేందుకు గత ఆరు నెలలుగా రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో ల్యాప్‌టాప్ చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. జూన్ 22న ఖాజాగూడలోని ఎంఆర్ గ్రాండ్ హాస్టల్‌లో మూడు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురికాగా, నమోదైన కేసు దర్యాప్తులో పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి జూన్ 26న అదుపులోకి తీసుకున్నారు. గత ఐదు నెలల్లో మొత్తం ఎనిమిది ల్యాప్‌టాప్‌లను దొంగిలించినట్లు విచారణలో తేలింది. వాటిలో నాలుగు ల్యాప్‌టాప్‌లను క్యాషిఫై యాప్ ద్వారా విక్రయించగా, మరో నాలుగు ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు. నిందితుడిపై రాయదుర్గంలో నాలుగు, మాదాపూర్‌లో ఒకటి కలిపి మొత్తం ఐదు చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

### ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేసి

# పేద విద్యార్థులను ఆదుకోండి

### - ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం

**(భారత శక్తి)** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు సర్దార్ సింగ్ విద్యార్థి సంగం నాయకులు సైదులు, శ్రీనివాసులు, రామకృష్ణ, సందీప్, మురళి లతో కలిసి మాట్లాడారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు చెల్లించకపోవడంతో ఓవైపు విద్యార్థులతో పాటు లెక్చరర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీఎంబర్స్మెంట్ కాకపోవడంతో సర్టిఫికెట్లు అందక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నోటిఫికేషన్లకు విద్యార్థులు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో రోస్టర్ ఉల్లంఘనలతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ విద్యార్థుల పట్ల శాపంగా మారిన క్రిమిలేయర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యా విధానంలో సైతం క్రిమిలేయర్ ను అమలు చేయడం పై మండిపడ్డారు. ఆధునిక యుగంలో సైతం విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు యూనివర్సిటీలను నియంత్రించడంతోపాటు ప్రస్తుతం విద్యనుభ్యసిస్తున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్లేస్మెంట్ డ్రైవులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థి నిరుద్యోగ యువజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

### గాదరాడలో వైభవంగా

# మహాకుంబాభిషేక మహోత్సవాలు

### - మూడో రోజు ఆధ్యాత్మిక శోభ36 నూతన ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ
### - ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు



**కోరుకొండ(భారత శక్తి)** కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో వెలసిన "ఓం శివశక్తి పీఠం శంభాల నగరం"లో మహాకుంబాభిషేక, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు వేడుకలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవాల్లో భాగంగా, నూతనంగా నిర్మించిన 36 దివ్య ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన పర్వాలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిగాయి. హోమగుండాల నుంచి వెలువడుతున్న పవిత్ర ధూపాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం దివ్యలోకాన్ని తలపించింది. శుక్రవారం వినాయక పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఓం శివశక్తి పీఠం సాంప్రదాయ తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, ధూప దీప నైవేద్యాల సమర్పణ నిరంతరాయంగా సాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

# ఏజెన్సీ-మైదానం బోర్డర్ రోడ్డు అధ్వాన్నం

### - పట్టించుకోని కూటమి ప్రభుత్వంగుంతలమయం, బురదమయం
### - నరకయాతన పడుతున్న గోపాలపురం, ఇందుకురు పేట ప్రజలు





**గోకవరం,(భారత శక్తి)** దేవీపట్నం మండలం.గోకవరం మండలం గోపాలపురం నుంచి ఇందుకురు పేటకు వెళ్లే ప్రధాన రహదారి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఏజెన్సీకి మైదాన ప్రాంతానికి బోర్డర్‌గా ఉన్న ఈ కీలక రోడ్డు చిన్నపాటి వర్షానికే పూర్తిగా బురదమయంగా మారి, పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి చెరువును తలపిస్తోంది.ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు రోడ్డు మొత్తం నీటి గుంతలు, బురదతో నిండిపోయింది. ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు, పాదచారులు అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. ఆటోలు, ట్రాక్టర్లు కూడా ఈ గుంతల్లో కూరుకుపోతున్నాయి.కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం
ఏజెన్సీ-మైదానం బోర్డర్‌లో ఉన్న మా రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి వర్షాకాలంలో ఇదే బాధ. పిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్నా, పేషెంట్లను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా ఈ బురదలోనే నడవాలి. కూటమి ప్రభుత్వం వచ్చినా మా రోడ్డు సమస్యను పట్టించుకోవడం లేదు. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్లడం తప్ప పరిష్కారం చూపడం లేదు" అని ఇందుకురు పేట గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గోపాలపురం, ఇందుకురు పేటతో పాటు ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లోని పలు గ్రామాలకు ఇదే ప్రధాన రవాణా మార్గం. రోజూ వందలాది మంది గిరిజనులు, రైతులు, విద్యార్థులు, కూలీలు ఈ రోడ్డుపైనే రాకపోకలు జరుపుతున్నారుఇప్పటికైనా గోకవరం మండల అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు స్పందించి ఏజెన్సీ-మైదానం బోర్డర్‌లోని గోపాలపురం-ఇందుకురు పేట రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని, తక్షణమే తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుంది

### - మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్(భారత శక్తి)** ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు.ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు.ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.

## హోటల్ మేనేజ్ మెంట్, కలినరీ ఆర్ట్స్‌తో అపార అవకాశాలు

**(భారత శక్తి)**హోటల్ మేనేజ్మెంట్, కలినరీ ఆర్ట్స్ విభాగాలతో విశ్వవ్యాప్త కెరీర్కు అపారఅవకాశాలున్నాయని ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం అన్నారు. ఆతిథ్య రంగంలో అవకాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, కెరీర్ కౌన్సిలర్లకు మరింత అవగాహన కల్పించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ హోటల్ మేనేజ్మెంట్, కలినరీ ఆర్ట్స్ కళాశాలలు, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్, తెలంగాణ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆఫ్ కలినరీ అండ్ హాస్పిటాలిటీ(టీచ్) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌ని హోటల్ ర్యాడిసన్ బ్లూ ప్లాజాలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడారు. అతిథులు.. రాడిసన్ బ్లూ హోటల్స్ సౌత్ ఇండియా ఏరియా వైస్ ప్రెసిడెంట్ సందీప్ జోషి, తెలంగాణ షెఫ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమే మరాఠీ, రాడిసన్ బ్లూ హోటల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాజ్ భట్టాచార్య, టీచ్ ప్రెసి డెంట్ సాక సుధా కుమార్, స్వామినాథన్ కుప్పురాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉండవల్లి సెంటర్లో ఉద్రిక్తత

**అమరావతి(భారత శక్తి)** శనివారం నాడు ఉండవల్లి సెంటర్లో ఉద్రిక్తత నెలకొంది. రాజధాని భూముల పరిశీలనకు వైసీపీ.. పేర్నినాని, లేళ్ల అప్పిరెడ్డి, సీఆర్డీఏ పరిరక్షణ బృందం వెళ్లారు. అక్కడి రైతులు వైసీపీ నేతలను అడ్డుకున్నారు. వైసీపీ నేతలపై కోడిగుడ్లు విసిరారు. ఘటనలో లేళ్ల అప్పిరెడ్డి కారు ధ్వంసం అయింది. సీఆర్డీయే పరిరక్షణ కమిటీ సభ్యులు, పోలీసులపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. పలువురు పోలీసులకు గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

## కడియం నర్సరీలలో వింత పురుగు విషం

### - కూలీలకు ప్రాణసంకటం

**కడియం(భారత శక్తి)** కడియం నర్సరీలలో వింత పురుగు విషం కక్కుతుంది. విశ్వవ్యాప్త ప్రసిద్ధి చెందిన తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ రైతులకు శాపంగా మారింది. ఈ నర్సరీలో పనిచేసే రెక్కాడితే కానీ డొక్కాడిని బ్రతుకులు... ఏ ఒక్క పూట పనిలోకి వెళ్ళకపోయినా పస్తులు ఉండవలసిందే. అలాంటి వారిపై యాసిడ్ పురుగులు దాడి చేసి అనారోగ్యానికి గురిచేస్తు, ఒంటిపై ఈ పురుగు పాకిన చోట పెద్దపెద్ద బొబ్బలు ఏర్పడి అగ్ని మంట వస్తున్నట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సరీ మొక్కలు లో భారీ స్థాయిలో వ్యాప్తి చెంది నర్సరీలో పనిచేసే కూలీలపై యాసిడ్ పురుగులు దాడి చేస్తున్నాయి. గత రెండు నెలలుగా ఈ పురుగులు నర్సరీల్లో అక్కడక్కడ కనిపించిన ఇటీవల కాలంలో లక్షల సంఖ్యలో వ్యాప్తి జూచెందడంతో ఈ పురుగులు దాడి ఎక్కువయింది. దీనితో కూలీలు నర్సరీలకు రావటం లేదని నర్సరీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒంటిపై ఈ పురుగులు దాడి చేసిన చోట ఏర్పడే బొబ్బలు సుమారు 20 రోజుల వరకు తగ్గటం లేదని బాధితులు వాపోతున్నారు.

యాసిడ్ పురుగులను నియంత్రించేందుకు ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని కాపాడాలని రైతులు, రైతు కూలీలు కోరుతున్నారు. ..

## లండన్లో తెలంగాణ విద్యార్థి అనుమనాస్పద స్థితిలో మృతి

**హైదరాబాద్(భారత శక్తి)** లండన్లో ఉన్నత చదువుల కోసం వెళ్లి లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాత్రి పడుకున్న శ్రీనాథ్ రెడ్డి తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు, అక్కడే ఉన్న అతని బంధువులకు స్నేహితులు సమాచారం అందించారు. ఉన్నత చదువుల కోసం అని వెళ్లి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని శ్రీనాథ్ రెడ్డి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయారు. శ్రీనాథ్ రెడ్డి స్వస్థలం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామం.

## హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు

### - హాజరయిన మంత్రి అడ్లూరి

**హైదరాబాద్(భారత శక్తి)** మలక్పేటలోని వికలాంగుల సంక్షేమ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 146వ హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి ప్రస్తావిస్తూ, వారి సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తరువాత అనంతరం హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# ‘బ్లాస్ట్’ మూవీ రివ్యూ!



కోలీవుడ్ నుంచి ఒక యాక్షన్ థ్రిల్లర్ ఇటీవల థియేటర్లకు వచ్చింది. అర్జున్ .. అభిరామి .. ప్రీతి ముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఆ సినిమా పేరే ‘బ్లాస్ట్’. ఏజీఎస్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి సుభాష్ కె రాజ్ దర్శకత్వం వహించాడు. తెలుగులో ఈ సినిమాకి పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, ఆశించిన స్థాయి రెస్పాన్స్ కనిపించలేదు. అయితే తమిళనాట మాత్రం ఈ సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. 18 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా 70 కోట్లకి పైగా వసూళ్లను సాధించింది. అలాంటి ఈ సినిమా 5 భాషల్లో ఈ నెల 25 నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. రాజారామ్ (అర్జున్) అతని భార్య నీలవేణి (అభిరామి) కూతురు ‘నీల’ (ప్రీతీ ముకుందన్) తమ్ముడు ఈశ్వర్ ( వివేక్ ప్రసన్న) కలిసి నివసిస్తూ ఉంటారు. రాజారామ్ అతని భార్య ఇద్దరూ కూడా మార్షల్ ఆర్ట్స్ కుటుంబాల నుంచి వచ్చినవారే. ఇద్దరికీ మార్షల్ ఆర్ట్స్ లో మంచి ప్రవేశం ఉంటుంది. అందువలన తమ కూతురు ‘నీల’కి కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. అవమానం .. అన్యాయం జరిగినప్పుడు ఎలా రియాక్ట్ కావాలనేది తండ్రి నుంచి ‘నీల’ నేర్చుకుంటుంది. రాజారామ్ చిన్న పిల్లలకు కరాటేలో శిక్షణ ఇస్తుంటాడు. ఆయన భార్య మిషన్ కుడుతుంటుంది. ‘నీల’ ఒక వైపున జాబ్ చేస్తూనే .. మరో వైపున మెడికల్ షాప్ లో బాబాయ్ కి సాయం చేస్తుంటుంది. ఇది ఇలా ఉండగా వరుణ్ దయాళన్ (జాన్ కొక్కేన్) 7వేల కోట్ల ప్రాజెక్టు ఒకటి ప్లాన్ చేస్తాడు. ఆ ప్రాజెక్టు కారణంగా 800 వందల కుటుంబాలు నివసించే ఒక చిన్నపాటి గ్రామం సమాధి అవుతుంది. ఆ ప్రాజెక్టు ముందుకు వెళ్లడానికి ఒక మినిస్టర్ కి వరుణ్ వెయ్యు కోట్లు లంచంగా ఇవ్వాల్సి వస్తుంది. వాటిని మినిస్టర్ ట్రస్ట్ పేరుతో ఉన్న ఎకౌంట్ కి ‘వైట్’ గా పంపించడం కోసం వరుణ్ ఏర్పాటు చేస్తాడు. అందుకోసం మూడు అంచెల పద్ధతిలో కృపాలన్ .. అబ్రహం .. శివ అనే ముగ్గురు అనుచరులను నియమిస్తాడు. ఆ వెయ్యి కోట్లకి సంబంధించిన ‘కోడ్’ గా ఒక 100 రూపాయల నోటు ఉంటుంది. అది అబ్రహం దగ్గర ఉంటుంది. అయితే ఒక చిన్న పొరపాటు కారణంగా అది ‘శివ’ పర్స్ లోకి వెళుతుంది. అనుకోకుండా పోలీసులకు పట్టుబడిన అబ్రహం, గాయాలతో అక్కడి నుంచి తప్పించుకుంటాడు. అతనికి అవసరమైన టాబ్లెట్స్ కోసం ఈశ్వర్ మెడికల్ షాప్ కి వెళ్లిన టోబీ, అక్కడున్న ‘నీల’తో గొడవ పడతాడు. అది కాస్తా కృపాలన్ గ్యాంగ్ రాజారామ్ ఇంటిని వెతుక్కుంటూ వచ్చేలా చేస్తుంది. రాజారామ్ ఫ్యామిలీ అంతా కలిసి ముగ్గురు రౌడీలను చంపేసి, గొయ్యితీసి పాతేస్తారు. ఆ ముగ్గురులో శివ ఒకడు .. అతని జేబులోని పర్సులోనే వెయ్యి కోట్లకి సంబంధించిన 100 నోటు ఉంటుంది. ఆ 100 నోటు కోసం వరుణ్ రంగంలోకి దిగుతాడు. ఫలితంగా రాజారామ్ ఫ్యామిలీ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందనేది మిగతా కథ. ఈ కథ మొదలైనప్పుడు .. ఓ తండ్రీ కూతుళ్ల అనుబంధానికి సంబంధించిన ఒక ఎమోషనల్ డ్రామా అనిపిస్తుంది. తమ పని తాము చేసుకుపోతున్న ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథగా కనిపిస్తుంది. ఆ తరువాత మాఫియా .. రాజకీయాలు కలిసి ఒక ప్రమాదకరమైన ప్రాజెక్టు దిశగా కదలడం మొదలవుతుంది. వాళ్లకి సంబంధించిన ఆ వ్యూహంలోకి తమ ప్రమేయం లేకుండానే హీరో ఫ్యామిలీ ఎంటర్ కావడం .. అది చాలా సామాన్యమైన ఫ్యామిలీనే అనుకుని విలన్ గ్యాంగ్ ఆ ఫ్యామిలీని ఎటాక్ చేయడం ఈ కథలో ఆసక్తిని రేకెత్తించే అంశంగా మారుతుంది. విలన్ తలపెట్టిన 7 వేల కోట్ల ప్రాజెక్టు .. అందులో వెయ్యి కోట్లను లంచంగా అడిగిన రాజకీయనాయకుడు.


ఈ ఇద్దరి పనులతో ముడిపడిన ఒక వందరూపాయల ‘నోటు’. ఈ మూడు అంశాలు ఈ కథలో చాలా కీలకమైనవిగా కనిపిస్తాయి. అంచెలంచెలుగా విలన్ అనుచరులు .. విలన్ నేరుగా రంగంలోకి దిగే తీరు ప్రేక్షకులను అలా కూర్చోబెట్టేస్తుంది. తండ్రీ .. తల్లీ .. కూతురు తమ మార్షల్ ఆర్ట్స్ తో విలన్ గ్యాంగ్ ను ఎదుర్కొనే తీరు, అందుకు సంబంధించిన ఫైట్స్ ను కంపోజ్ చేసిన విధానం మెప్పిస్తుంది. సినిమా ఇంకా 37 నిమిషాల నిడివి ఉందనగా ఇక ఈ కథ ఊపిరి తీసుకోనీయదు. స్క్రీన్ ప్లే లోని గొప్పతనం ఇక్కడి నుంచి మరింత బయటపడుతుంది. హీరో ఇంటిలోకి అబ్రహం ఎంట్రీ ఇవ్వడం, ఒక విలన్ ను వెతుక్కుంటూ వెళ్లి బంధించడం .. అదే సమయంలో వెతుక్కుంటూ వచ్చిన మరో విలన్ బంధించడం, హీరో ఎవరనేది విలన్, అతను ఎవరనేది హీరో ఒకే సమయంలో గుర్తించడం, అందుకు సంబంధించిన యాక్షన్ సీక్వెన్స్ లు ఆడియన్స్ కి థ్రిల్ ను కలిగిస్తాయి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ దృశ్యాలు ఆడియన్స్ ను కదలనీయకుండా చేస్తాయి. అర్జున్ .. అభిరామి .. ప్రీతీ ముకుందన్ నటన ఈ సినిమాకి హైలైట్ అని చెప్పాలి. అలాగే విలన్ పాత్రలను చేసిన వారు కూడా ఆయా సన్నివేశాలను అలా నిలబెట్టేశారు. అరుణ్ రాధాకృష్ణన్ ఫొటోగ్రఫీ .. రవి బస్రూర్ నేపథ్య సంగీతం .. ప్రదీప్ రాఘవ్ ఎడిటింగ్ ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయనడంలో ఎలాంటి అభిశయోక్తి లేదు. కథ .. స్క్రీన్ ప్లే .. యాక్షన్ సీన్స్ .. ఎమోషనల్ డ్రామా మంచి మార్కులను రాబడతాయి. ఓటీటీలో ఈ సినిమా చూసిన తరువాత, ఇంత ఇంట్రెస్టింగ్ కంటెంట్ ను థియేటర్లలో మిస్సయ్యామని మాత్రం తప్పకుండా అనిపిస్తుంది “మనవాళ్లకు మాత్రమే కాదు, మనచుట్టూ ఉన్నవారిలో ఎవరికి అన్యాయం జరిగినా ప్రశ్నించాలి .. అలాంటివారి తరఫున పోరాడాలి” అనే సందేశంతో తెరకెక్కిన సినిమా ఇది. బలమైన కథాకథనాలతో, ఆద్యంతం అలరించే యాక్షన్ .. ఎమోషనల్ సన్నివేశాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది. మని తమని తాము రక్షించుకోవడం కోసం మార్షల్ ఆర్ట్స్ అవసరం. ఇతరులను రక్షించాలంటే మార్షల్ ఆర్ట్స్ తో పాటు మానవత్వం కూడా అవసరమనే సందేశంతో కూడిన ఈ కంటెంట్ చాలా రోజుల పాటు గుర్తుండిపోతుంది.



## ఇలాంటి ఇంటర్వెల్ చూడలేదు!


“దీవాన’ కేవలం లవ్‌స్టోరీనే కాదు. ఇందులో జీవితం తాలూకు అనేక విషయాల్ని చర్చించారు. ప్రతీ ఒక్కరూ ఈ సినిమాను చూసి ప్రోత్సహించాలి’ అన్నారు హీరో శ్రీవిష్ణు. హర్షిత్‌రెడ్డి, స్నేహ మణిమేగలై జంటగా శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వంలో వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించిన ‘దీవాన’ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీవిష్ణు అతిథిగా థాంక్స్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సినిమాల్లో ఇలాంటి ఇంటర్వెల్‌ను తాను చూడలేదని, అలా ఎందుకు చేశాడని దర్శకుడి మీద కోపం వచ్చిందన్నారు. ఈ సినిమాలోని ప్రతీ పాత్రను ప్రేక్షకులు గుర్తుపెట్టుకుంటున్నారని, మొదటివారం తర్వాత కూడా 70శాతం ఆక్యుపెన్సీ ఉండటం సినిమా విజయానికి నిదర్శనమని హీరో హర్షిత్ రెడ్డి అన్నారు. పెళ్లిచూపులు, కేరాఫ్ కంచరపాలెం తరహాలో చాలా అరుదుగా వచ్చే సినిమా ఇదని, ఇప్పట్లో ఓటీటీలో రిలీజ్ చేయడం లేదని, ప్రేక్షకులు థియేటర్లో చూసి ఫీల్ అవ్వాలని నిర్మాతలు కోరారు. ఇప్పటివరకు ఏ భాషలో రాని కథ ఇదని, బిగ్‌స్క్రీన్‌లోనే చూడాల్సిన సినిమా ఇదని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## వీరనాగ.. రహస్య రుద్ర సైన్యమే..!



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ ‘నాగబంధం’. విరాట్‌కర్ణ కథానాయకుడిగా, అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమీనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా శుక్రవారం ఈ సినిమా నుంచి ‘వీరనాగ.. రహస్య రుద్ర సైన్యమే... వీరనాగ సహస్ర కర్మయోగమే..’ అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ పాటను జునైద్ కుమార్-అభే స్వరపరచగా, దీపక్ బ్లూ ఆలపించారు. నాగసాధువుల ఆధ్యాత్మిక తాండవాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. కైలాస పర్వత ప్రాంతాలు, నాగసాధువుల తాండవం విజువల్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తాయని, ఈ పాటలోని సినిమాటోగ్రఫీ, విజువల్స్.. ఓ దివ్యదర్శనాన్ని తలపిస్తాయని, నాగసాధుగా విరాట్‌కర్ణ తాండవం, ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్‌ప్రెజెన్స్ ఆడియన్స్‌ని కట్టి పడేస్తాయని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, మహేశ్ మంజ్రేకర్, మురళీశర్మ, దక్ష నాగార్కర్ ఇందులో కీలక పాత్రధారులు.

## దర్శకుడు భాగ్యరాజ్ మృతి



చెన్నై సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. తమిళ దర్శకుడు నటుడు భాగ్యరాజ్ (73) కన్నుమూసారు. గుండెపోటు కారణంగా అయన మరణించారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అయన నటుడిగా, దర్శకుడిగా, రైటర్ గా, స్వరకర్తగా, నిర్మాతగా పలు సినిమాలు అందించారు.తమిళ చిత్ర పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన భాగ్యరాజ్ ను ఇండియన్ సినిమాలో ‘కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే’ అని పిలుస్తుంటారు . తెలుగులో అల్లరి నరేశ్ నటించిన పెళ్లైంది కానీ’ సినిమాకు డైరెక్టర్ గా వ్యవహరించారు. ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, అబ్బాయి గారు సినిమాలకు స్క్రిప్ట్ అందించారు. తెలుగులో భాగ్యరాజ్ చివరి చిత్రం శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన కుబేర.మూడు రోజుల కిందట గోవాలో కుష్బూ కూతురి పెళ్లికి హాజరయిన భాగ్యరాజ్ హఠాన్మరణంతో తమిళ సినీ లోకం ఒక్కసారిగాగ్భ్రాంతికి గురైంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న భాగ్యరాజ్ చిత్ర పరిశ్రమకు తీరని లోటు. భాగ్యరాజ్ మరణవార్త తెలియగానే కోలీవుడ్తో పాటు సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. భాగ్యరాజ్ కు శరణ్య భాగ్యరాజ్ (కుమార్తె), శంతను భాగ్యరాజ్( కుమారుడు) ఉన్నారు. పారిజాతం అనే సినిమాతో శరణ్య, సక్కరకట్టి అనే సినిమాతో శంతను సినీరంగంలో ప్రవేశించారు.

### విడుదలకు ముందే ప్రకంపనలు సృష్టిస్తున్న

## హాలీవుడ్ చిత్రం ‘ఒడిస్సీ’



ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తన నూతన చిత్రంతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నారు. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ‘ది ఒడిస్సీ’ చిత్రం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐమ్యాక్స్ స్క్రీన్లన్నింటినీ ప్రత్యేకంగా కేటాయించారు. దీని ప్రభావంతో, జులై 31న విడుదల కానున్న మార్వెల్ చిత్రం ‘స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే’కు ప్రారంభ వారంలో ఐమ్యాక్స్ థియేటర్లు లభించని పరిస్థితి నెలకొంది. ప్రాచీన గ్రీకు రచయిత హోమర్ రచించిన ప్రాచీన గాథ ఆధారంగా రూపొందిన ‘ది ఒడిస్సీ’లో మ్యాట్ డామన్ గ్రీకు రాజు ఒడిస్సియస్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా ఐమ్యాక్స్ ఫిల్మ్ కెమెరాలతో చిత్రీకరించారు. ఈ ఘనత సాధించిన తొలి ఫీచర్ ఫిల్మ్‌గా ఇది చరిత్ర సృష్టించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నోలన్, ఐమ్యాక్స్ సంస్థ సంయుక్తంగా కృషి చేసి ఈ సాంకేతిక మైలురాయిని అధిగమించారు. ఈ కారణం చేతనే ప్రీమియం థియేటర్లలో ఈ చిత్రానికి అగ్ర ప్రాధాన్యత లభించింది. జులై 17న విడుదల కానున్న ‘ది ఒడిస్సీ’ సుమారు మూడు వారాల పాటు ఐమ్యాక్స్ స్క్రీన్లపై ఏకచత్రాధిపత్యం వహించనుంది. భారత్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. దీంతో ‘స్పైడర్ మ్యాన్’ చిత్రం ఐమ్యాక్స్‌కు బదులుగా స్క్రీన్‌ఎక్స్, 4డీఎక్స్, డాల్బీ సినిమా వంటి ఇతర ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. వాస్తవానికి స్పైడర్ మ్యాన్ చిత్రాన్ని కూడా ఐమ్యాక్స్‌కు అనువైన 1.90:1 యాస్పెక్ట్ రేషియోలో చిత్రీకరించడం గమనార్హం. ఐమ్యాక్స్ స్క్రీన్లు దక్కకపోయినప్పటికీ, ‘స్పైడర్ మ్యాన్’ అడ్వాన్స్ బుకింగ్స్ పలు దేశాల్లో రికార్డులను సృష్టిస్తున్నాయి. గతంలో నోలన్ తెరకెక్కించిన ‘ఓపెన్‌హైమర్’ విడుదల సమయంలోనూ ఇలాంటి ఆసక్తికర పోటీనే నెలకొంది. మరోవైపు ‘ది ఒడిస్సీ’లో మ్యాట్ డామన్‌తో పాటు టామ్ హాలండ్, అన్నేహాథవే, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండాయా వంటి భారీ తారాగణం నటిస్తోంది.

## ‘మా ఇంటి బంగారం 2’కి గ్రీన్ సిగ్నల్.. సక్సెస్ మీట్‌లో బిగ్ అనౌన్స్‌మెంట్ చేసిన రాజ్ నిడిమోరు




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ‘మా ఇంటి బంగారం’ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ భారీ వసూళ్లు రాబట్టింది. సినిమా సాధించిన ఈ విజయోత్సాహంలో చిత్ర బృందం వైజాగ్‌లో గ్రాండ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయితే ఈ వేడుకలో అందరి దృష్టిని ఆకర్షించిన విషయం ‘మా ఇంటి బంగారం’ సీక్వెల్‌పై వచ్చిన అధికారిక ప్రకటన. చిత్ర రచయిత, సమంత భర్త రాజ్ నిడిమోరు మాట్లాడుతూ.. ప్రేక్షకుల స్పందన చూసి తాము ఎంతో ఆనందంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రేక్షకులను ఉద్దేశించి, “మా ఇంటి బంగారం పార్ట్-2 వస్తే చూస్తారా?” అని ప్రశ్నించారు. వెంటనే సభా ప్రాంగణం మొత్తం చప్పట్లతో, కేరింతలతో మార్మోగిపోయింది.

అభిమానుల నుంచి వచ్చిన ఈ భారీ స్పందనతో రాజ్ నిడిమోరు ‘మా ఇంటి బంగారం 2’ను అధికారికంగా ప్రకటించారు. “ఇప్పటికే నా మైండ్‌లో సీక్వెల్‌కు సంబంధించిన ఓ అద్భుతమైన ఐడియా ఉంది. మరో రెండేళ్లలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. ఇదే టీమ్‌తో పార్ట్-2 రూపొందుతుంది” అని ఆయన వెల్లడించారు. సాధారణంగా ఒక సినిమా పూర్తయ్యాక దానికి సీక్వెల్ చేయాలనే ఆలోచన తనకు ఎప్పుడూ రాలేదని, కానీ ‘మా ఇంటి బంగారం’ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని రాజ్ చెప్పారు. ఈ కథలో ఇంకా చెప్పాల్సిన ఎన్నో విషయాలు ఉన్నాయి. ప్రేక్షకులు ఈ పాత్రలను ఎంతో ప్రేమించారు. అందుకే ఈ కథను మరింత పెద్ద స్థాయిలో కొనసాగించాలని అనిపించింది. ఒక సినిమాకు పార్ట్-2 చేయాలనే ఇన్‌స్పిరేషన్ నాకు కలగడం ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు.పార్ట్-2లో మరిన్ని ఆసక్తికరమైన పాత్రలు, కొత్త ట్విస్టులు ఉండబోతున్నాయని రాజ్ నిడిమోరు సంకేతాలు ఇచ్చారు. మా ఇంటి బంగారం 2 డబుల్ ఫన్, డబుల్ ఎక్సైట్‌మెంట్‌తో ఉంటుంది. మొదటి భాగాన్ని మించిన వినోదాన్ని అందించేలా కథను సిద్ధం చేస్తున్నాం అని ఆయన చెప్పారు. ‘మా ఇంటి బంగారం’ విజయంతో ఇప్పటికే సంబరాల్లో ఉన్న సమంత అభిమానులకు ఇప్పుడు సీక్వెల్ ప్రకటన మరింత ఆనందాన్ని ఇచ్చింది. సోషల్ మీడియాలో ‘మా ఇంటి బంగారం 2’ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. మరోసారి సమంత-నందిని రెడ్డి-రాజ్ నిడిమోరు కాంబినేషన్ మ్యాజిక్ చూడబోతున్నామంటూ అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అధికారిక ప్రకటన రావడంతో ‘మా ఇంటి బంగారం 2’పై ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. రాబోయే రెండేళ్లలో ఈ సీక్వెల్ ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# చిరుత లేదు స్థానికులు భయాందోళనకు గురికావద్దు

**- ఫారెస్ట్ రేంజ్ ఆధికారి విరేశం**

**శంషాబాద్(భారత శక్తి)** ఎయిర్ పోర్ట్‌లోని చిన్మయా స్కూల్ నుండి ఎయిర్ పోర్ట్‌కు వచ్చే దారిలో చిరుత కనిపించిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు తన సిబ్బందితో కలిసి రేంజ్ ఆధికారి విరేశం పరిశీలించారు. ఎయిర్ పోర్ట్ లోని నర్సరీ మరియూ ఇతర ప్రాంతాల్లో జంతువు అడుగు గుర్తులను పరిశీలించారు. పరిశీలించిన ప్రదేశంలో గుర్తించిన పాద ముద్రలు చిరుత లేదా పులివి కాదని ఆయన తెలిపారు. ఇక్కడ కనిపించిన పాదముద్రలు అడవి పిల్లి లేదా అడవి నక్కవిగా భావిస్తున్నట్లు తెలిపారు. చిరుత సంచరించినట్లు ఎక్కడా అనవాలు లభించలేదని అన్నారు. తాము పరిశీలించిన చోట సిసి కెమారాలు ఏర్పాటు చేసి చూస్తామని తెలిపారు. స్థానికులు ఎవరు కూడా భయపడవద్దని సూచించారు.

## ఎస్ఆర్ఆర్ కళాశాలలో అన్న అక్క ఇంటర్న్షిప్ ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ముగింపు




**కరీంనగర్(భారత శక్తి)** కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అన్న అక్క మెంటార్షిప్' టీచింగ్ ఇంటర్న్షిప్ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల పాటు జరిగిన ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసింది. చివరి రోజు బీఎస్సీ బాటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫిషరీస్, క్రాప్ ప్రొడక్షన్ విద్యార్థులకు శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, శిక్షణ పొందిన ఐదవ సెమిస్టర్ విద్యార్థులు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై మార్గదర్శనం చేయాలని సూచించారు. శిక్షణలో ఏఐ టూల్స్, కోడింగ్, పైథాన్, కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్డినో బోర్డు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు శిక్షణ పొందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 30 గంటలపాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నోడల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, వివిధ విభాగాలాధిపతులు, అధ్యాపకులు, శిక్షకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీటితో ఎల్ఎండీని నింపాలి

**- ఎమ్మెల్యే గంగుల**



**కరీంనగర్(భారత శక్తి)** కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోసి ఎల్ఎండీ జలాశయాన్ని వెంటనే నింపాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి మట్టం అడుగంటడంతో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం వినూత్న నిరసన చేపట్టగా, గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు సమయంలో ప్రజలను ఆదుకునేదే కాళేశ్వరం ప్రాజెక్టు అని, బీఆర్ఎస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి సాగు, తాగునీరు అందించిందన్నారు. ప్రస్తుతం ఎల్ఎండీలో కేవలం ఐదున్నర టీఎంసీల నీరు మాత్రమే ఉండటంతో కరీంనగర్ ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మేడిగడ్డ మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి మోటార్లను ఆన్ చేసి మిడ్‌మానేరు, ఎల్ఎండీ జలాశయాలను నింపాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రూ. 4.50 లక్షలతో నిర్మించిన సవారీ షెడ్డును ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే

**భీంపూర్(భారత శక్తి)** మండల కేంద్రంలో గల సవారీ బంగ్లా ఆవరణలో షెడ్డు కావాలని గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను కోరగా స్పందించిన ఎమ్మెల్యే మాట ఇచ్చి మొహారం సందర్భంగా షెడ్డు వేయించి గ్రామస్తుల కోరికను తీర్చి మాట నిలబెట్టుకున్నారు. మండల కేంద్రంలో పీరీలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. భీంపూర్ మండల కేంద్రంలో అన్ని వర్గాలు కలిసి ఐక్యతతో పీరీల పండుగ జరుపుకోవడం సంతోషమన్నారు. వారి ఐక్యతతో షెడ్డు నిర్మాణం జరిగిందని వచ్చే పీరీల పండుగ వరకు వంద శాతం సవారీ బంగ్లా సైతం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీమాతో భరోసా

**- సీఎం డిప్యూటీ సీఎం స్పోర్ట్స్ మినిస్టర్ ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన స్పోర్ట్స్ ఉద్యోగులు**




**హైద్రాబాద్(భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగుల సంక్షేమాన్ని ఉద్యోగుల భద్రతకు భరోసా ఇస్తూ ఉచిత ప్రమాద బీమా రక్షణను కల్పించడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఒక రూపాయి అదనపు భారం లేకుండా ఉచిత ప్రమాద బీమా రక్షణ కల్పించడం పట్ల వారు సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎల్బీ స్టేడియం లో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఉద్యోగులు , సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్ మాట్లాడుతూ, ఉచిత ప్రమాద బీమా వల్ల ఉద్యోగుల కుటుంబాలకు మనో ధైర్యాన్ని ఇస్తుందని ఈ పథకం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడం వల్ల ఎందరో చిన్న ఉద్యోగులు వారి కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి వివిధ శాఖల్లో పని చేస్తూ రెగ్యులర్ కు నోచుకోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని హెల్త్ ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో లిక్కర్ అమ్మకాలలో విస్కీదే టాప్




**హైదరాబాద్(భారత శక్తి)** తెలంగాణ మద్యం విక్రయాల్లో అత్యధిక - వాటా విస్కీదేనని గణాంకాలు చెబుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో - పోలిస్తే.. తెలంగాణలో మద్యం ప్రియులు.. విస్కీకే ఎక్కువప్రాధాన్యమిస్తున్నారు. ఇక త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు " పెంచేందుకు సర్కార్ ప్రయత్నాలు చేస్తుండటంతో.. విస్కీ లవర్స్కు షాక్ - తప్పదనే వాదనలువినిపిస్తున్నాయి. మద్యం ధరల పెంపు ప్రతిపాదనలతోమందుబాబుల్లో తెలియని ఆందోళన నెలకొంది. తెలంగాణలోని ఏ వైన్స్, ఏ బార్లోకి వెళ్లినా విస్కీ అమ్మకాలే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా ఎండవేడిమిని తట్టుకునేందుకు మద్యం ప్రియులు.. చల్లని బీర్లు తాగుతున్నా.. విస్కీ అమ్మకాలే అత్యధికంగా ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ మద్యం మార్కెట్లో విస్కీదే సింహభాగం ఉంటుంది. తక్కువ ధర బ్రాండ్ల మద్యం దగ్గరి నుంచి ఖరీదైన బ్రాండ్ల వరకు మందుబాబులు విస్కీకే ఓటేస్తున్నారు. మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో విస్కీ వినియోగం అత్యధికంగా ఉంది. ఇదే సమయంలో.. తొందర్లోనే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో విస్కీ ప్రియుల జేబుకు చిల్లు తప్పదనే వాదనలు వ్యక్తం అవుతున్నాయి. 2026లో మద్యం మార్కెట్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో అమ్ముదు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్లో ఖ 5 - విస్కీవాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో దేశంలోనే - అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, ఆంధ్రప్రదేశ్లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాండీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. 3 హైదరాబాద్ లోని ఐటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు 3 పేర్కొంటున్నాయి. తెలంగాణలో విస్కీ అంటే కేవలం మద్యం మాత్రమే కాదని.. సామాజిక జీవనంలో ఒక భాగమైపోయిన అలవాటు గా మరిపోయేందని చెప్పవచ్చు. మద్యం ధరలు పెరిగితే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని కుటుంబాలు, రిటైల్ వ్యాపారులు, హాస్పిటాలిటీ రంగంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 .. . 140-160 6 2 21.07 అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270-రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళ్లు విస్కీయే కావడం విశేషం. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్లో విస్కీ తర్వాత బ్రాందీ నిలిచింది. బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాందీకి భారీగా డిమాండ్ ఉండేది.

అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణలో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

## అమరావతిలో పర్యటనకు వెళ్లిన వైసీపీ లీడర్లు!

**- కోడిగుడ్లతో దాడి చేసిన రాజధాని రైతులు!**

**విజయవాడ(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆ ప్రాంతంలో పర్యటించేందుకు యత్నించిన వైసీపీ నేతలను రాజధాని రైతులు అడ్డుకున్నారు. తమను అన్యాయం చేసి ఇప్పుడు పర్యటనకు ఎందుకు వస్తున్నారని నిలదీశారు. అడుగు ముందుకు వేస్తే దాడులు చేస్తామని హెచ్చరించారు. వారిపై కోడిగుడ్లతో దాడులు చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసులు, ప్రత్యేక బలగాలు యత్నించాయి. అమరావతిలో ప్రభుత్వం అక్రమాలు చేస్తోందని బలవంతంగా భూములు లాక్కొంటోందని వైసీపీ చాలా కాలంగా ఆరోపిస్తోంది. రాజధాని పేరుతో కోట్ల రూపాయలు అప్పులు చేస్తోందని వాదిస్తోంది. కానీ అక్కడ ప్రజల, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శిస్తోంది. ఇప్పటికే కొందరు రైతులు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. వారి బాధలను చెప్పుకొన్నారు. వారి సమస్యలు విన్న జగన్ ప్రత్యేక కమిటీ వేస్తున్నట్టు వెల్లడించారు. వెంటనే పది మందితో సీఆర్డీఏ రైతు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నేడు పెనుమాక గ్రామంలో పర్యటించింది. దీన్ని రాజధాని రైతులు వ్యతిరేకిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని చంపేసే ప్రయత్నం చేశారని రైతులు వాపోతున్నారు. మూడు రాజధానుల పేరుతో నాటకాలు ఆడారని మండిపడుతున్నారు. తమపై అక్రమ కేసులు పెట్టారని, ఆడవాళ్లను హింసించారని గుర్తు చేస్తున్నారు. ప్రశ్నించిన తమపై బూతులతో నేతలు రెచ్చిపోయారని చెబుతున్నారు. అలాంటి వ్యక్తులు ఇప్పుడు తమకు సమస్యలు ఉన్నాయనే వంకతో రాజధానిలో పర్యటించడం సరికాదని అంటున్నారు. అందుకే వైసీపీ నేతలు అడ్డుకుంటున్నామని రాజధాని రైతులు తెలిపారు. వైసీపీ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, ఎం. అరుణ్‌కుమార్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వి.డైమండ్ బాబు, మనోహర్ రెడ్డి., సుదర్శన్ రాజధాని రైతులతో సమావేశమయ్యేందుకు యత్నించారు. వారిని రైతులు అడ్డుకున్నారు. వారికి వ్యతిరేకంగా మహిళలు సైతం రోడ్లపైకి వచ్చారు. మరోసారి అమరావతికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వెళ్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వారిని ముందుకు వెళ్లనీయకుండా రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకున్నా రైతులు వినిపించుకోలేదు. వైసీపీ నేతలు రాజధానిలో అడుగు పెట్టడానికి లేదని భీష్మించారు. ప్రత్యేక బలగాలు వచ్చిన వారిని అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేశారు. భారీ సంఖ్యలో రైతులు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలోనే కొందరు రైతులు తమ వెంట తెచ్చుకున్న కోడిగుడ్లతో వైసీపీ నేతల కార్లపై దాడి చేశారు. పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన పోలీసులు వైసీపీ నేతలను అక్కడి నుంచి పంపేశారు. వైసీపీ నేతలు, రాజధాని రైతుల మధ్య జరిగిన పెనుగులాటలో గుర్తు తెలియని వ్యక్తుల రాళ్ల దాడిలో పోలీసు గాయపడ్డాడు. ఆయన్ని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఐదు పెళ్లిళ్లు, ఒకే మోసం..

**- అనంతపురంలో సీరియల్ పెళ్లికూతురు అరెస్ట్**

**అనంతపురం(భారత శక్తి)** పెళ్లిళ్ల పేరుతో వరుస మోసాలకు పాల్పడుతూ పలువురు పురుషులను వంచించిన ఓ యువతిని అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా దొండపూడికి చెందిన వజ్రపు మణి అలియాస్ శ్వేతా రెడ్డి అలియాస్ కీర్తి (27) ఈ కేసులో ప్రధాన నిందితురాలు.

ఈమె ఇప్పటివరకు ఐదుగురిని వివాహం చేసుకుని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు.విజయవాడకు చెందిన సుమప్రియ, అశోక్, శశికళ, రామకృష్ణ అనే మధ్యవర్తులతో కలిసి ఈమె ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. పెళ్లి సమయంలో కట్నం లేదా ఇతర ప్రలోభాలతో కూడిన హామీలు ఇచ్చి, వివాహానంతరం కొద్ది రోజులు భర్తతో కలిసి ఉండి, ఆపై కనిపించకుండా పోవడం ఈమె పంథా అని పోలీసులు తెలిపారుపెద్దవడుగూరు మండలం కాసేంపల్లికి చెందిన యాపర్ల సుధీర్ రెడ్డి అనే వ్యక్తిని 2025లో ఈమె వివాహం చేసుకుంది. పెళ్లైన కొద్ది రోజులకే ఆమె ఎవరికీ చెప్పకుండా అదృశ్యం కావడంతో, బాధితుడు పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఇటీవల కర్ణాటకలోని మల్లికుప్పంకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్న నిందితురాలు, పెళ్లైన ఆరు రోజులకే మదనపల్లె వైపు ప్రయాణిస్తుండగా పోలీసులకు చిక్కింది. మదనపల్లె మండలం చీకలబైలు సమీపంలో పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఒకరితో వివాహం జరిగిన విషయం మరొకరికి తెలియకుండా ఇలా ఐదుగురిని ఆమె పెళ్లి చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

## 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

**ఖమ్మం(భారత శక్తి)** ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి.ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఏపీలో 11 వేల మందికి ఓపీఎస్

**- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**

**విజయవాడ(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 11 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా 2002-03 డీఎస్సీ ద్వారా ఎంపికై, 2004 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉద్యోగ సంఘాలు సుదీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదముద్ర వేసింది.ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన కృతజ్ఞతా సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా, ఈ మార్పు కోసం కృషి చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ ఎ. విద్యాసాగర్‌తో పాటు ఇతర ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.ఈ నిర్ణయం ఉద్యోగులకు గొప్ప ఊరటనిచ్చిందని, పెన్షన్ భద్రత అనేది ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని విద్యాసాగర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొనియాడారు. గతంలో చంద్రబాబు హయాంలోనే సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, డెత్-కమ్-రిటైర్మెంట్ గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించారని ఈ సందర్భంగా నేతలు గుర్తుచేశారు.2004 సెప్టెంబరుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన అర్హులైన ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు కల్పించాలని ఈ వారం మొదట్లో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. దీనితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), సొసైటీలు, రెసిడెన్షియల్ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

## సాయికృష్ణ కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లకు సిట్ అల్టిమేటం

**విజయవాడ(భారత శక్తి)** విజయవాడలోని కృష్ణలంక రాజీవ్‌నగర్‌కు చెందిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో ఇద్దరు కానిస్టేబుళ్ల కోసం సిట్ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వారి వివరాలు చెప్పాలని కృష్ణలంక పోలీస్ స్టేషన్ సిబ్బందిని, కుటుంబ సభ్యులను ఆరా తీస్తున్నారు. కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందేనంటూ కుటుంబ సభ్యులకు నోటీసులు కూడా ఇచ్చారు. మరోవైపు సాయికృష్ణకు సంబంధించిన కేసుల వివరాలు, ఇతర విషయాల గురించి కూపీ లాగుతున్నారు. ఈ సిట్ దర్యాప్తు కొనసాగుతున్న టైంలోనే సాయికృష్ణ తల్లి విజయ లక్ష్మి సీబీఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ వేశారు. గాదె సాయికృష్ణ కేసులో ముగ్గురు అధికారులను సిట్ విచారించింది. డీసీపీ కృష్ణకాంత్, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కె.లతాకుమారి, దక్షిణ మండలం ఏసీపీ మానసను వేర్వేరుగా పిలిచి ఈకేసులో పలు ప్రశ్నలు అడిగారు. సాయికృష్ణను ట్రేస్ చేసి ఎలా పట్టుకున్నారని, అతన్ని అరెస్టు చేస్తున్నట్టు ఎవరు సమాచారం ఇచ్చారని, అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకొచ్చిన తర్వాత సమాచారం ఇచ్చారా లేదా, మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోవడానికి కారణాలేంటీ? అసలు సాయికృష్ణపై ఉన్న కేసులు ఏంటీ? ఇలా అన్ని కోణాల్లో వారిని సిట్ అధికారులు ప్రశ్నించారు. సాయికృష్ణను తీసుకొని వస్తున్నట్టు చెప్పారు కానీ ఒకసారి వచ్చిన తర్వాత మెజిస్ట్రేట్ ముందు పెట్టిన తర్వాతే తమకు సమాచారం ఇస్తారని ఈ కేసులో ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వారు తేల్చేశారు. ఇప్పటికే సాయికృష్ణ లాకప్‌లోనే చనిపోయినట్టు కన్ఫామ్ చేసుకున్న సిట్ అధికారులు అసలు ఇది ఎలా జరిగింది... ఉన్నతాధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు, డెడ్‌బాడీని ఎలా మాయం చేశారనే విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై నాగరాజు నోరు విప్పలేదు. ఆయనకు సహకరించిన కానిస్టేబుల్స్ అశోక్, నాని పరారీలో ఉన్నారు. మరో ప్రైవేటు వ్యక్తితో కలిపి నలుగురు మధ్యే కేసుకు సంబంధించిన కీలక విషయాలు దాగి ఉన్నాయని అనుమానిస్తున్నారు. అందుకే ఈ వాల్‌ను బ్రేక్ చేయడానికి అన్ని వైపుల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఓవైపు నాగరాజును కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు కోర్టు ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు ఆయనకు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రస్తుతానికి పరారీలో ఉన్నారు. నాగరాజు అరెస్టు అయినప్పటి నుంచి వారి గురించి ఎలాంటి సమాచారం లేదు. వారిని క్యాచ్ చేస్తే కచ్చితంగా కేసులో లీడ్ దొరుకుతుందని, క్లోజ్ చేసేందుకు అవసరమైన సమాచారం లభిస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నారు. అయితే ఆ ఇద్దరు ఎక్కడ ఉన్నారో తెలియడం లేదు. ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరై అజ్ఞాతంలోకి వెళ్లారు. నాగరాజుకు సన్నిహితుడిగా ఉన్న సురేష్‌ను మాత్రం సిట్ అధికారులు రహస్యంగా విచారిస్తున్నారు. పరారీలో ఉన్నవారి వివరాలు చెప్పాలని, సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో వారు ఇరుక్కుపోయారని తప్పించుకునే ఛాన్స్ లేదని సిట్ అధికారులు కుటుంబాలకు తెలియజేశారు. విచారణకు హాజరుకావాల్సిందేనంటూ నోటీసులు జారీ చేశారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా హెచ్చరించారు. కుటుంబ సభ్యుల నుంచి కూడా ఎలాంటి సమాచారం రావడం లేదు. మరోవైపు పోలీస్ స్టేషన్ సిబ్బందిని కూడా సిట్ అధికారులు విచారించారు. ఏదైనా విషయం తెలిస్తే చెప్పాలని అంటున్నారు.

### సెటిల్మెంట్‌కు ప్రయత్నాలు

ఘటన జరిగి, వివాదం ముదురుతున్న టైంలో మధ్యవర్తిత్వం కోసం ఈ ముగ్గురు సాయికృష్ణ మేనమామ ఇంటికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై సాయికృష్ణ కుటుంబ సభ్యులు సిట్ అధికారులకు సమాచారం అందజేశారు. విషయాన్ని సెటిల్ చేసుకుందామని రాయబారం నడిపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కూడా సిట్ అధికారులు సాయికృష్ణ మేనమామను ప్రశ్నించారు. ముగ్గురు కారులో వచ్చారని అందులో సురేష్ మాత్రం ఇంటికి వచ్చి మాట్లాడినట్టు ఆయన పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఈ కేసు విచారణ ముమ్మరంగా సాగుతున్న వేళ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి అందరికీ షాక్ ఇచ్చారు. కేసు విచారణపై ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం విచారణ జరుపుతున్న సిట్‌పై నమ్మకం లేదని అంటున్నారు. ఏదైనా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరపాలని లేదా సీబీఐకు కేసును అప్పగించాలనని ఆమె అనుబంధ పిటిషన్ వేశారు. తన కుమారుడిని తీసుకెళ్లినప్పటి నుంచి ప్రస్తుతం విచారణ సాగుతున్న తీరు వరకు ప్రతీది అనుమానంగా ఉందని అన్నారు. అందుకే స్థానిక పోలీసుల ప్రమేయం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణకు ఆదేశించాలని రిక్వస్ట్ పెట్టుకున్నారు. సాయికృష్ణ కేసు విషయంలో తెలంగాణకు చెందిన వ్యక్తి జాతీయ మానవహక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్సీ చాలా సీరియస్‌గా స్పందించింది. వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఏపీ డీజీపీ, విజయవాడ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

**- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**

**- అశోక్ నగర్‌లో ప్రత్యేక ఓటరు సర్వేను పరిశీలించిన మాజీ మేయర్**



ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అశోక్ నగర్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా (ఎస్ ఐ ఆర్ ) సర్వేను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు. బూత్ నంబర్--418లో సర్వే నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,( ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాలను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి రెడ్డి, సంజీవ్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నరసింహ, శ్రీనివాస్ గౌడ్, బీఎల్ఏలు, స్థానిక కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతప్రమానాలతో త్వరితగతిన పూర్తి చేయాలి

**-మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



కూకట్పల్లి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ లో రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతప్రమానాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుంది అని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ ను అన్ని హంగుల తో సకల సౌకర్యాల తో నిర్మిస్తామని మాజీ కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియచేసారు. ఫంక్షన్ హల్ లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాల్ మరియు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 27 (భారత శక్తి) రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచి మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్ సభ్యులను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, శనివారం జిల్లా భరోసా కేంద్రాన్ని సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో సమర్ధవంతంగా విధులు నిర్వహించడం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లా పోలీసులకు మరిన్ని విజయాలు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొంటూ, షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం. నర్సయ్యతో పాటు షీ టీమ్ సభ్యుల సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం



కూకట్పల్లి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 27: ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పిజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నెంబర్ 71లో నివసించే శ్రీనివాస్(52) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, నాగేశ్వరరావు వాలి, అనిల్ కుమార్, జి నాగేశ్వరరావు, అప్పలనాయుడు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా ముగిసిన సామూహిక షష్టిపూర్తి మహోత్సవాలు





మంచిర్యాల ప్రతినిధి, జూన్ 27(భారత శక్తి): మంచిర్యాల పవిత్ర గోదావరి నది తీరంలోని శ్రీ గౌతమేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన వాసవి క్లబ్ ఆధ్వర్యంలోని సామూహిక షష్టిపూర్తి మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. మైటీ రెండు రోజులు షష్టిపూర్తి ఆవాహనం కలశస్థాపన మృత్యుంజయ హోమం గణపతి హోమం మృతిక స్నానాలు నిర్వహించగా శుక్రవారం నాడు ఉదయం నుండి చండీ హోమం, మంగళ స్నానాలు, పూర్ణాహుతి, వేదమంత్రాలతో షష్టిపూర్తి నిర్వహించుకున్న దంపతులు ఆశీర్వాదన కార్యక్రమాలతో ముగిసింది. మంచిర్యాల చరిత్రలోనే మొట్టమొదటిసారి సామూహిక షష్టిపూర్తి మహోత్సవాన్ని మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం పట్ల భక్తులు అమితానందాన్ని గురయ్యారు. వేద పండితులు గడియారం బాలాజీ శర్మ ఆధ్వర్యంలో పండితుల బృందం వేదొక్త శాస్త్ర మంత్రోచ్చారణతో మూడు రోజులపాటు వైభవంగా ఈ షష్టిపూర్తి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ షష్టిపూర్తి మహోత్సవ కార్యక్రమంలో ఆలయ నిర్వహకురాలు గోపగాని శ్రీదేవి, వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, పి ఆర్ ఓ ఉత్తూరి రమేష్, జోన్ చైర్మన్ పడకంటి శ్రీనివాస్, జిల్లా క్యాబినెట్ అధికారి మల్యాల సంగీత, కొత్త సురేందర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం చైర్మన్ మాదంశెట్టి సత్యనారాయణ, విజయం వేంపల్లి క్లబ్ అధ్యక్షురాలు పడకండి రజిత, కార్యదర్శి కుకుడపు గాయత్రి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు ముక్త విశ్వాస్, కార్యదర్శి ప్రసన్నకుమార్, కోశాధికారి గందెశ్రీ అనిల్, నస్పూర్ మండల్ కార్యదర్శి తోట రాజయ్య కోశాధికారి, చందూరి ప్రభాకర్, ఇందారం కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు రావుల మహేష్, కార్యదర్శి రాచకొండ నాగేశ్వర్ తోపాటు పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీయూకేటీ బాసర్ విద్యార్థినికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 27: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు వారి లక్ష్యాలకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆర్‌జీయూకేటీ (బాసర్)లో విద్యను అభ్యసిస్తున్న కామారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థిని నిఖిత కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించి విద్యా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్పందించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో విద్యార్థినికి రూ. 10,000 విలువైన చెక్కును రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందజేశారు. ఈ సహాయం పుస్తకాలు, అధ్యయన సామగ్రి, ప్రయాణం తదితర విద్యా అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలో నిలిపివేయకుండా, పట్టుదలతో ఉన్నత విద్యను కొనసాగించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థిని నిఖిత జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ ఆర్థిక సహాయం తన చదువును కొనసాగించేందుకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజన్న, నరసింహులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డల్లాస్ లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని కలిసి సన్మానం చేసిన మన తెలుగు బిడ్డలు వారితో ప్రత్యేక భేటీ



జనగామ(భారత శక్తి)జూన్ 27: తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ని, ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని అమెరికాలోని డల్లాస్ నగరంలో అక్కడ చదువుతున్న మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కి చెందిన విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ మీరు ఇంకా బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని,మరీ ముఖ్యంగా కన్నా తల్లిదండ్రులను మరువకూడదు అన్నారు. అసలు మీరు అమెరికా వచ్చారంటేనే మీ తల్లిదండ్రుల కృషి వాళ్ళ వారు చేసిన పుణ్యాలే మనకు వస్తాయ్. ఏదోఒకసారి కష్టం వచ్చింది అని మనం ఎంచుకున్న లక్ష్యాన్ని మరువకూడదు, ఎన్ని ఒడిదోడుకులు ఎదురైనా పోరాడి మన లక్ష్యాన్ని చేరాలి. ఎంత ఎత్తుకు ఎదిగిన కన్నా తల్లిదండ్రులను మరువకూడదు, మీరు మరింత ఉన్నత శిఖరాలకు చేరి మీ తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచి పేరు తెస్తూ మీరు మరికొంత మంది మన తెలుగు బిడ్డలకి ఆదర్శంగా నిలవాలి అని వారికి దిశానిర్దేశం చేసారు.

# ములుగు జిల్లాలో విషాదం..

## పిడుగుపాటుకు రైతు సహా 21 ఆవులు మృతి




ములుగు, భారత శక్తి ప్రతినిధి, జూన్ 27:ములుగు జిల్లా తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆవులను ఇంటి సమీపంలోని పొలంలో కట్టివేయగా, భారీ వర్షంతో పాటుగా ఒక్కసారిగా పిడుగు పడటంతో 21 ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో పశువుల యజమాని సమ్మయ్యతో పాటు గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో పశువులు మృతి చెందడంతో యజమానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.

# తెలంగాణలో రేపు పల్స్ పోలియో

**- ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 27: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని స్పష్టం చేశారు. జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేయనున్నట్లు, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు విస్తృతంగా ఉండటంతో జూలై 1న అదనంగా మరో రోజు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**- ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 27: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న, మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరే విధంగా కృషి కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, డ్వాక్రా గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, యశోద, ఆర్.పీ. కరుణ, ఆర్.పీ. జ్యోతి, ఏరోళ్ళ విష్ణు, సీతారామ్ రెడ్డి, ఎం. అశోక్, పి. సాయి రాజ్, విజయ్, షకీల్ మరియు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజామాబాద్ జీపీవో ప్రవీణ్ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు, బదిలీ చేయాలని డిమాండ్!**

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల , జూన్ 27: కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ పంచాయతీ జీపీవో సిలివేరి ప్రవీణ్ తీరుపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ధ్రువపత్రాల జారీ విషయంలో ఆయన ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శనివారం కోనరావుపేట తహసీల్దార్‌కు గ్రామస్తులు ఒక వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జీపీవో సిలివేరి ప్రవీణ్ వివిధ రకాల ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సర్టిఫికెట్లతో ఎలాంటి సంబంధం లేని విషయాలను అడుగుతూ, ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నారని వారు ఆరోపించారు. ఒకవేళ ఎవరైనా దీనిపై ఎదురు ప్రశ్నిస్తే.. "మీకు ధ్రువపత్రాలు ఎలా వస్తాయో నేనూ చూస్తా" అంటూ బెదిరింపులకు దిగుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సదరు అధికారి గ్రామ పాలకవర్గాన్ని సైతం ఏమాత్రం పట్టించుకోకుండా ఒక నియంతలా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు అధికారి తీరుపై సమగ్ర విచారణ జరపాలని, వెంటనే ఆయనను నిజామాబాద్ గ్రామం నుండి బదిలీ చేసి, ఆయన స్థానంలో మరొక కొత్త అధికారిని నియమించాలని గ్రామస్తులు తహసీల్దార్‌ను గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy